ప్రతిపక్షం

www.prathipaksham.in

శుక్రవారం 27.03.2026 | Published From Hyderabad | సంపుటి: 19 సంచిక: 7 పేజీలు: 8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

కెరీర్‌కు కరోలినా వీడ్కోలు 8



ప్రజా ప్రభుత్వంలో

పేదల వైద్యానికి ప్రాధాన్యం

- రాజీవ్ ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంచాం
- బీఆర్ఎస్ హయాంలోనే 600.27కోట్లు బకాయిలు
- అప్పుడు నెలకు రూ.52 కోట్లు వెచ్చిస్తే.. నేడు రూ.89 కోట్లు వెచ్చింపు
- ప్రజాపాలన వచ్చిన తర్వాత 2408.51 కోట్లు చెల్లింపులు
- రూ.2046 కోట్లు సీఎం సహాయనిధికింద చెల్లింపులు
- అసెంబ్లీ సమావేశాలలో సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 26: పేదల వైద్యానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రైవేట్ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకపోవడంతో పేదల వైద్యంపై ప్రభావం పడుతోందన్న ప్రచారంలో నిజం లేదని సీఎం అన్నారు. అసెంబ్లీ సమావేశాలలో ఆరోగ్యశ్రీ బకాయిలపై ముఖ్యమంత్రి మాట్లాడారు. ఇప్పటి వరకు రూ.2408 కోట్లు చెల్లించామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల విషయంలో అవినీతి జరిగిందని, ఎవరెవరి పీఏలు, ఇతరులు ఎవరున్నారో త్వరలోనే బయటపడుతుందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ బకాయిలు గత ప్రభుత్వం నుంచి వచ్చాయన్న సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ హయాంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద నెలకు రూ.52 కోట్లు ఖర్చు చేస్తే తమ ప్రభుత్వం ప్రతీనెలా రూ.89 కోట్లు వెచ్చిస్తోందని తెలిపారు. ఇప్పటివరకు రూ.2408.51 కోట్లు తమ ప్రభుత్వం చెల్లించిందని స్పష్టం చేశారు. ఇందులో ప్రభుత్వ ఆస్పత్రులకు రూ.927 కోట్లు, ప్రైవేటు ఆస్పత్రులకు రూ.1,480 కోట్లు బకాయిలు చెల్లించామని రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. గత ప్రభుత్వం రూ.600.27 కోట్లు బకాయిలు పెట్టిందని, అందులో ప్రభుత్వం ఆస్పత్రులకు రూ.240.11 కోట్లు, ప్రైవేటు ఆస్పత్రులకు రూ.360.16కోట్లబకాయిలు ఉన్నాయని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో

...:: మిగతా 2లో

సీఎస్ఆర్‌నిధుల సమీకరణకు ప్రత్యేక పాలసీ

- సీఎస్ఆర్ సెల్, కార్యాలయం ఏర్పాటు చేయాలి
- తెలంగాణ సీఎస్ఆర్ పోర్టల్ రూపొందించాలి
- అధికారులకు సీఎం ఆదేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 26: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల సమీకరణతో పాటు సమర్థ వినియోగానికి ప్రత్యేక పాలసీ రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సీఎస్ఆర్ విరాళాలతో రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టే కార్పొరేట్ సంస్థలను ప్రభుత్వం తరఫున అభినందించాలని సూచించారు. ప్రతి ఏడాది అత్యుత్తమ భాగస్వామ్యం పంచుకున్న సంస్థల ప్రతినిధులను అభినందించేందుకు ప్రత్యేక కార్యక్రమం

...:: మిగతా 2లో

చిన్నారులకు నాణ్యమైన విద్య, పోషకాహారం

- ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్‌తో సీఎం రేవంత్‌భేటీ
- సమగ్ర మానవాభివృద్ధి అంశంపై సమీక్ష

...:: 2లో

మహిళా రిజర్వేషన్ చట్టసవరణకు తొందరెందుకు?

మహిళా రిజర్వేషన్ కోటా చట్టంలో సవరణలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకంత తొందరపడుతోందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాక దీనిపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలన్నారు.

7

దౌత్యంలో మోదీ ప్రభుత్వం ఘోర వైఫల్యం

పశ్చిమాసియా యుద్ధంలో మధ్యవర్తిగా పాకిస్థాన్ వ్యవహరిస్తోందనే అంశం ప్రాంతీయ దౌత్యంలో మోదీ ప్రభుత్వ వైఫల్యాన్ని సూచిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. భారత్ తత్తరపాటును కనిపించకుండా కవర్ చేసే ప్రయత్నాన్ని విదేశాంగ మంత్రి జైశంకర్ చేస్తున్నారన్నారు.

7

నేడు కవిత కీలక ప్రకటన

- పార్టీ ఆవిర్భావం, ఎజెండా, జెండా వివరాలు వెల్లడించనున్న జాగృతి అధ్యక్షురాలు
- నిజామాబాద్లో శ్రీరామ నవమి వేడుకలు
- శ్రీ రఘునాథ స్వామి ఆలయంలో పట్టు వస్త్రాలు సమర్పించనున్న కవిత దంపతులు
- అనంతరం జాగృతి కార్యాలయంలో మీడియా సమావేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 26: శ్రీరామ నవమి సందర్భంగా పార్టీ ఏర్పాటుపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక ప్రకటన చేయనున్నారు. పార్టీ ఆవిర్భావం, ఎజెండా, జెండా తదితర వివరాలను ఆమె వెల్లడిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తన మెట్టినిల్లు అయిన నిజామాబాద్ వేదికగా ఆమె చేయనున్న ప్రకటనపై ఆసక్తినెలకొంది. నిజామాబాద్ జాగృతి కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రెస్ మీట్ నిర్వహిస్తారు. అంతకు ముందు

...:: మిగతా 2లో

ఏప్రిల్ 2 నుంచి 'ఇంటిగ్రేటెడ్ భూభారతి'

- ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు
- సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు.. అంతా ఒకే గొడుగు కిందకు
- ఒకే క్లిక్‌తో సమస్త భూ సమాచారం
- ప్రతి సర్వేనెంబర్‌కు భూధార్ నెంబర్
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్ మార్చి 26: తెలంగాణ భూపరిపాలనలో సరికొత్త శకం ఆరంభం కాబోతోందని, గత ప్రభుత్వ హయాంలో ధరణి తెచ్చిన చిక్కుముడులను విప్పుతూ, రైతులకు అత్యంత పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడమే లక్ష్యంగా కొత్తగా రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ను ఏప్రిల్ 2 నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ , రిజిస్ట్రేషన్ , ఎన్ఐసి అధికారులతో

...:: మిగతా 2లో

బస్సు ప్రమాదం ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రధాని

ఏపీలోని మర్కాపురం జిల్లాలోని రాయవరం వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్రమోదీ స్పందించారు. ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు.

7

ఏపీలో ఘోర బస్సు ప్రమాదం

- 14 మంది సజీవదహనం,, 28 మందికి తీవ్ర గాయాలు
- మార్కాపురంలో ప్రైవేట్ బస్సు దగ్ధం
- ప్రమాద సమయంలో బస్సులో 41 మంది
- హరికృష్ణ ట్రావెల్స్ బస్సుగా గుర్తించిన అధికారులు
- ప్రధాని మోడీ, తెలుగు రాష్ట్రాల సీఎంలు దిగ్భ్రాంతి

ప్రతిపక్షం, మార్కాపురం

మార్చి 26: ఏపీలోని మార్కాపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. టిప్పర్‌ను ఢీకొని ప్రైవేట్ బస్సు దగ్ధమైంది. ఈ ఘటనలో 14 మంది సజీవ దహనమవ్వగా, 28 మందికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 41 మంది ఉన్నట్లు సమాచారం. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను మార్కాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రైవేటు బస్సు హరికృష్ణ ట్రావెల్స్‌కు

...:: మిగతా 3లో

ఒప్పందంపై త్వరగా తేల్చండి

- ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక
- అమెరికాతో చర్చల ప్రసక్తే లేదు: ఇరాన్
- మిత్రదేశాల జాబితా విడుదల చేసిన ఇరాన్
- జాబితాలో ఇండియా, చైనా, రష్యా, పాకిస్తాన్, ఇరాక్
- అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు
- హోటళ్లలో దాక్కుంటున్న అమెరికా సైనికులు: ఇరాన్

ప్రతిపక్షం, నేషనల్ డెస్క్

పశ్చిమాసియాలో కాల్పుల విరమణపై ఇప్పట్లో ఒప్పందం కుదిరే అవకాశం కనపడడం లేదు. ఇరాన్‌తో మధ్యవర్తులు చర్చిస్తున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించగా అటువంటిదేమీ లేదంటూ ఇరాన్ తేల్చేసింది. తాజాగా, గురువారం ట్రంప్ మరోసారి ఇరాన్‌కు హెచ్చరికలు జారీచేశారు. తాను అందజేసిన శాంతి ప్రతిపాదనలను తీవ్రంగా పట్టించుకోవాలని ట్రంప్ గురువారం హెచ్చరించారు. ఇరాన్‌ను నాసిరకం యోధులు, గొప్ప సంధానకర్తలుగా అభివర్ణిస్తూ చర్చల కోసం ఇరానే వేడుకుంటున్నదని ట్రంప్ చెప్పారు. ఇరాన్‌తో యుద్ధంలోకి ప్రవేశించిన తర్వాత మొదటిసారి క్యాబినెట్ సమావేశంలో పాల్గొనడానికి ముందు విలేకరులతో ట్రంప్ మాట్లాడుతూ యుద్ధానికి దౌత్యపరమైన పరిష్కారం కోసం తపిస్తున్నది ఇరానే తప్ప అమెరికా కాదని చెప్పారు. టెహ్రాన్ నుంచే ఒత్తిడి వస్తున్నదని ఆయన వ్యాఖ్యానించారు. ఒప్పందం చేసుకునేది వాళ్లే(ఇరాన్) తప్ప నేనుకాదు అని ఆయన చెప్పారు. కాగా, ఇరానియన్ సంధానకర్తలు చాలా భిన్నంగా, విచిత్రంగా ఉన్నారు. సైనికపరంగా పూర్తిగా నాశనమై మళ్లీ పుంజుకునే అవకాశం లేని కారణంగా వారు ఒక ఒప్పందం కోసం మమల్ని వేడుకోవాలి. అయినప్పటికీ వారు కేవలం మా ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని బహిరంగంగా చెబుతున్నారు. అది తప్పు అంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఆలస్యం కాకముందే వాళ్లు త్వరగా మేల్కొనాలి. ఎందుకంటే

...:: మిగతా 2లో

దావోస్ ఒప్పందాలతో 2.19 లక్షల కోట్ల పెట్టుబడులు

- ఓర్వలేక విపక్షాలు విష ప్రచారం చేస్తున్నాయి
- తప్పుడు ప్రచారం రాష్ట్ర అభివృద్ధికి మంచిది కాదు
- ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేస్తాం
- అసెంబ్లీలో మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 26: దావోస్ పెట్టుబడులు, ఎంవోయూలపై విపక్షాల విమర్శలకు అసెంబ్లీలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు తీవ్రంగా స్పందించారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తుంటే ఓర్వలేక విపక్షాలు విష ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. స్వార్థ రాజకీయాల కోసం చేస్తున్న ఈ తప్పుడు ప్రచారం రాష్ట్ర అభివృద్ధికి మంచిది కాదని హితవు పలికారు. రాష్ట్రానికి మొత్తం రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని

...:: మిగతా 2లో



ఇండియా సహా ఐదు మిత్ర దేశాలకే అనుమతి

హార్ముజ్ జలసంధిని తెరవాలని ఇరాన్‌కు విజ్ఞప్తులు వస్తున్న నేపథ్యంలో మిత్ర దేశాలకు మాత్రమే నౌకల రవాణాకు అనుమతులు మంజూరు చేస్తామని ఇరాన్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

7

పేదల వైద్యానికి ప్రాధాన్యం

మొదటిపేజీ తరువాయి

రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద నెలకు రూ.52 కోట్లు ఖర్చు చేస్తే తమ ప్రభుత్వం ప్రతీనెలా రూ.89 కోట్లు వెచ్చిస్తోందని తెలిపారు.

రూ.10 లక్షలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ

గతంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల విషయంలో అవినీతి జరిగిందని సీఎం ఆరోపించారు. రూ.2046 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. 27 నెలల్లో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామని, టీచింగ్ కాలేజీలకు రోగులు వెళ్లట్లేదని, రాజీవ్ ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంచామని, టీచింగ్ కాలేజీల నిర్వహణ, గ్రూప్ 1 అధికారులకు అప్పగిస్తామని, ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకువచ్చామని వివరించారు. విదేశాల్లో నిపుణులైన వైద్యుల సేవలను తమ ప్రభుత్వం ఉపయోగించుకోవాలని ఆలోచిస్తుందని రేవంత్ రెడ్డి చెప్పారు. గోషామహల్‌లో 30 ఎకరాల్లో రూ.3వేల కోట్లతో ఉస్మానియా ఆస్పత్రి నిర్మిస్తున్నామని, ఉస్మానియా ఆస్పత్రి పనులు వేగంగా జరిగేందుకు చర్యలు తీసుకున్నామని గుర్తు చేశారు. ప్రతిరోజు మెడికల్, హెల్త్ విభాగాల్లో సవాళ్లు ఎదురవుతాయని, తమ ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇస్తే స్వీకరిస్తామని తెలిపారు.

అవసరమైతే మరిన్ని నిధులు

విద్యా, పేదల వైద్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, వైద్యానికి నిధులు కేటాయించి రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని సీఎం తెలిపారు. భవిష్యతులో వైద్యశాఖలో సంస్కరణలు తీసుకురాబోతున్నామని, సభలో సభ్యులు ఇచ్చే సలహాలను స్వీకరిస్తామని, విద్య అందుబాటులో ఉన్నా నాణ్యమైన విద్య లేదని పేర్కొన్నారు. పేదల విద్య, వైద్యం విషయంలో ఒక్క రూపాయి కూడా కోత విధించమని, అవసరమైతే మరిన్ని నిధులు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆస్పత్రుల నిర్వహణను గ్రూప్1 అధికారులకు అప్పగించే ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు.

సీఎస్ఆర్ నిధుల సమీకరణకు ప్రత్యేక పాలసీ

మొదటిపేజీ తరువాయి

ఏర్పాటు చేయాలని చెప్పారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఈ అభినందన ఉత్సవానికి ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్రస్థాయిలో సీఎస్ఆర్ సెల్ ఏర్పాటు చేయాలని, ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని కార్పొరేట్ కంపెనీలు సీఎస్ఆర్ తో చేపడుతున్న కార్యక్రమాల వివరాలు, అన్ని ప్రభుత్వ విభాగాల్లో అందుబాటులో ఉన్న ప్రాజెక్టులు, సీఎస్ఆర్ ద్వారా చేపట్టేందుకు వీలున్న కార్యక్రమాల వివరాలన్నీ సమన్వయం చేసే బాధ్యతలను రాష్ట్రస్థాయి సెల్ నిర్వర్తిస్తుందన్నారు. ప్రభుత్వానికి, కార్పొరేట్ సంస్థలకు అనుసంధానంగా ఉండేలా ప్రత్యేకంగా తెలంగాణ సీఎస్ఆర్ పోర్టల్ రూపొందించాలని సీఎం ఆదేశించారు. కార్పొరేట్ సంస్థలు సీఎస్ఆర్ విరాళాలను ఇచ్చేందుకు, వివిధ విభాగాల పరిధిలో చేపట్టేందుకు వీలున్న ప్రాజెక్టుల వివరాలన్నీ పోర్టల్ లో పొందుపరచాలన్నారు. కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వాన్ని సంప్రదించేందుకు, తమకు అనువైన ప్రాజెక్టులను ఎంచుకునేందుకు వీలుగా ఈ పోర్టల్ ఆకర్షణీయంగా తయారు చేయాలని చెప్పారు. జాతీయ స్థాయిలో సీఎస్ఆర్ విరాళాల వాటా మన రాష్ట్రంలో కేవలం 3 శాతం మాత్రమే ఉందని అధికారులు సీఎంకు నివేదించారు. ఇప్పటి వరకు వచ్చిన సీఎస్ ఆర్ ఫండ్స్ ఆశించిన స్థాయిలో లేవని, తెలంగాణ లో కంపెనీలు, పరిశ్రమలు ఏర్పాటు చేసి సీఎస్ఆర్ ఫండ్స్ వేరే చోట ఖర్చు పెడితే ఎలా..? అని సీఎం అన్నారు. రాష్ట్రానికి మరిన్ని సీఎస్ఆర్ ఫండ్స్ రావాల్సిన అవసరం ఉందని, మన రాష్ట్రంలో ఉన్న కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమలు తెలంగాణలోనే ఎక్కువ సీఎస్ఆర్ ఖర్చు పెట్టేలా చూడాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో సీఎస్ఆర్ సమీకరణకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని చెప్పారు. ఈ వాటాను పెంచుకునేందుకు వీలుగా కొత్త పాలసీ ఉండాలని, కార్పొరేట్ సంస్థలను ఆకర్షించే విధానాలను అనుసరించాలని చెప్పారు. సీఎంతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచిఘోష్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి, సీఎం సెక్రెటరీ మాణిక్యరాజ్, యోగితారాణా, శశాంక, భవేష్ మిశ్రా, నిఖిల్ చక్రవర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సేవలు

హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సర్వీసులు ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఎంఎంటీఎస్‌లో ప్రయాణికుల తగ్గుముఖంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఎంఎంటీఎస్ సర్వీసులపై శాసనమండలి హాల్‌లో సీఎం రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. కార్యాలయాల సమయాల్లో ఎంఎంటీఎస్‌ల సంఖ్య పెంచడంతో పాటు క్రమంతప్పకుండా సమయ పాలన పాటిస్తూ సర్వీసులు నడపాలని సీఎం ఆదేశించారు. ఎంఎంటీఎస్ స్టేషన్ల వద్దకు ఆర్టీసీ బస్సులు వెళ్లేందుకు అవకాశం లేకపోవడం, స్టేషన్లు లోపలికి ఉన్నందున అక్కడకు రాకపోకలు సాగించేందుకు వీలుగా మినీ బస్సులు నడిపే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. స్వీయ ఆదాయ వనరులు పెంచుకునేందుకు ప్రయత్నించాలని అధికారులకు సీఎం సూచించారు. సమీక్షలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తదితరులుపాల్గొన్నారు

ఏప్రిల్ 2 నుంచి 'ఇంటిగ్రేటెడ్ భూభారతి'

మొదటిపేజీ తరువాయి

మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా భూపరిపాలన సేవలను మరింత వేగవంతంగా అందించడానికి రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ , సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ భూభారతి పోర్టల్‌ను అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి భూలావాదేవీ వివరాలు కనిపించేలా పారదర్శకంగా ఈ పోర్టల్‌ను రూపొందించినట్లు వెల్లడించారు.

ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు

ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ను నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలాల్లో వచ్చేనెల 2 నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని మంత్రి తెలిపారు. ఈ పైలట్ మండలాల్లో మెరిట్ , డీమెరిట్లను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి అవసరమైన మార్పులు, చేర్పులు చేసి రెండవ దశలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని, అలాగే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపి భూభారతి పోర్టల్‌ను కూడా తీసుకురావడం జరిగిందన్నారు. భూభారతి చట్టంలో పేర్కొన్నవిధంగా వ్యవసాయ భూములకు సంబంధించి క్రయ, విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.తద్వారా రాష్ట్రంలో భూవివాదాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఐదు మండలాల్లో ప్రతి సర్వే నెంబరుకు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా నక్షాలేని ఐదు గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూధార్ నెంబర్‌ను కేటాయించడం జరిగిందన్నారు. ఒక క్లిక్ తో రైతులకు సంబంధించిన భూముల పూర్తి సమాచారం లభించేలా చాలా సులువుగా, సులభతరంగా ఉండేలా ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రూపొందించామని, ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయిన వెంటనే కావలసిన సమాచారం లభిస్తుందన్నారు. అన్ని సేవలు లభించేలా మూడు విభాగాలను అనుసంధానం చేస్తూ భూభారతి పోర్టల్ను పూర్తి స్థాయిలో ప్రజలకు చేరువ చేయబోతున్నామని తెలిపారు. ప్రక్రియ పూర్తయ్యేవరకు వివరాలను తెలియజేస్తూ ఎస్ఎంఎస్ ద్వారా ఖాతాదారునికి సమాచారం కూడా అందుతుందన్నారు. ధరణి పోర్టల్‌లో 36 మాడ్యూల్స్ ఉండగా, భూభారతి పోర్టల్‌లో ఒకే చాప్టర్ కింద తీసుకువచ్చామన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డీఎస్ లోకేష్ కుమార్, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఎన్ఐసీ అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులకు నాణ్యమైన విద్య, పోషకాహారం

- ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్‌తో సీఎం రేవంత్‌భేటీ
- సమగ్ర మానవాభివృద్ధి అంశంపై సమీక్ష

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 26: రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, పోషకాహారం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డితో ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్ గురువారం భేటీ అయ్యారు. రాష్ట్ర శాసనమండలి హాల్‌లో గురువారం జరిగిన సమావేశంలో పలు అంశాలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో 0.10 ఏళ్లలోపు పిల్లల్లో పోషకాహారం లోపం, విద్యాభ్యాసన స్థాయి సామర్థ్య లోపాలకు సంబంధించి పలు నివేదికలను కార్తీక్ మురళీధరన్ సీఎం దృష్టికి తీసుకువచ్చారు. వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన అంశాలను ఆయన సీఎంకు సూచించారు. ఆయా అంశాలపై తాము ఇప్పటికే ప్రత్యేక శ్రద్ధ పెట్టామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం పెట్టేందుకు బడ్జెట్ లో కేటాయింపులు చేసినట్లు వివరించారు.

అంగన్వాడీల్లో మరొకరిని నియమించండి

అంగన్వాడీల్లో టీచర్లు, ఆయాలతో పాటు పోషకాహారం అందజేసేందుకు అదనంగా మరొకరిని నియమించాలని కార్తీక్ మురళీధరన్ సూచించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు పోషకాహారం అందజేసేందుకు పోషణ సఖి పేరుతో మరొకరిని నియమించేందుకు అవకాశం ఉందని అధికారులు తెలియజేశారు. కార్తీక్ మురళీధరన్ సూచించే అంశాలను కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలోని 29 స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం అధికారులకు సూచించారు. కార్తీక్ మురళీధరన్‌తో సమన్వయం చేసుకొని ఈ అంశంపై ప్రత్యేక నివేదిక రూపొందించి సమర్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు. సమీక్షలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో సామాజిక కార్యకర్త నిఖిల్ డే బృందం భేటీ

ప్రజా సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయిలో కూడా నిర్వహించడానికి సంబంధించి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శాసనమండలి సమావేశ హాలులో ముఖ్యమంత్రితో ప్రముఖ సామాజిక కార్యకర్త నిఖిల్ డే నేతృత్వంలోని ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా భేటీ అయింది. ప్రజా సమస్యల పరిష్కారానికి అనుసరిస్తున్న విధానాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా నిఖిల్ డే ప్రశంసించారు. తెలంగాణలో ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో చేపడుతున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయికి తీసుకెళ్లడంపై ఈ సమావేశంలో చర్చించారు. అందుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాజస్థాన్ ప్రభుత్వం చేపడుతున్న "జన్ సూచన పోర్టల్" తరహాలో తెలంగాణలోనూ 'ప్రజా సూచన పోర్టల్ ' ఏర్పాటు చేయాలని చర్చ జరిగింది. వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపడుతున్న అన్ని పథకాలకు సంబంధించిన వివరాలను ఒకే చోట అందుబాటులో ఉండే విధంగా ఈ పోర్టల్ రూపొందించనున్నారు. ఐటీ శాఖ ఆధ్వర్యంలో ఈ పోర్టల్‌ను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈసందర్భంగా తెలంగాణ గిగ్ వర్కర్స్ బిల్‌ను నిఖిల్ డే ప్రశంసించారు. ఈ చట్టం దేశంలోనే చారిత్రాత్మకంగా నిలుస్తుందని అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి గారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు కవిత కీలక ప్రకటన

మొదటిపేజీ తరువాయి

శ్రీ రఘునాథ ఆలయం (ఖిల్లా రాంమందిర్) లో జరిగే శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొంటారు. శ్రీ సీతారాముల కళ్యాణంలో తన భర్త దేవనపల్లి అనిల్ తో కలిసి కవిత పాల్గొంటారు. శ్రీ సీతారాములకు పట్టు వస్త్రాలను సమర్పిస్తారు. శ్రీరామ నవమి సందర్భంగా ఆ రాముల వారి ఆశీస్సులు తెలంగాణ రాష్ట్రంపై ఉండాలని, ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని ఆమె ఆకాంక్షించారు.

పలు రామాలయాల్లో పట్టు వస్త్రాల సమర్పణ

ఏటా శ్రీరామ నవమి సందర్భంగా నిజామాబాద్ పార్లమెంట్ నియోజవవర్గ పరిధిలోని రామాలయాల్లో కవిత దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించటం ఆనవాయితీ. ఈ ఏడాది రఘునాథ స్వామి ఆలయంలో కవిత దంపతులు స్వయంగా పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. డిచ్‌పల్లి, బోధన్, ఆర్మూర్ సిద్దుల గుట్ట, పోచంపాడు, జగిత్యాల్ ధరూర్ క్యాంప్, విద్యానగర్ రామాలయం, కోరుట్ల నియోజకవర్గం మల్లాపూర్ మండలంలోని వాల్గొండ రామాలయాల్లో కవిత దంపతుల తరపున వారి ప్రతినిధులు పట్టు వస్త్రాలు సమర్పించున్నారు. శ్రీరామ నవమి వేడుకల్లో కవిత గారితో పాటు జాగృతి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనసున్నారు.

అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాలి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 26: పరిశ్రమలు తమ సామాజిక బాధ్యత సి ఎస్ ఆర్ నిధుల ద్వారా గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి మరింత సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పటాన్ చెరు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం అమీన్ పూర్ సర్కిల్ బొల్లారం డివిజన్ పరిధిలో ఐటీసీ పరిశ్రమ సౌజన్యంతో 32 లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన కంప్యూటర్లు, చెత్త సేకరణ ఆటోలు, త్రీ చక్ర సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బొల్లారం పరిధిలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాలలకు 15

కంప్యూటర్లు, రెండు ప్రింటర్లు, బొల్లారం మున్సిపల్ విభాగానికి 8 చెత్త సేకరణ ఆటోలు, దివ్యాంగుల కోసం 3 త్రి చక్ర సైకిళ్లను లను ఎమ్మెల్యే జీఎంఆర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐటీసీ కంపెనీ తన సామాజిక బాధ్యతలో భాగంగా పాఠశాలల అభివృద్ధికి, బొల్లారం డివిజన్ పరిధిలో పారిశుధ్యం పెంపొందించేందుకు సహకారం అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, సి.ఐ రవీందర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి, బీఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, సీనియర్ నాయకులు హనుమంత్ రెడ్డి, రవీందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి,లక్ష్మా రెడ్డి,ఐటీసీ సంస్థ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, ప్లాంట్ హెడ్ సుబ్రహ్మణ్యం, మాజీ ప్రజాప్రతినిధులు వేణుపాల్ రెడ్డి, సాయి కిరణ్ రెడ్డి శ్రీకాంత్ యాదవ్, బీరప్ప యాదవ్, సతీష్,రత్నం, కృష్ణ, బీసీ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, అధికారులు పాల్గొన్నారు.

దావోస్ ఒప్పందాలతో 2.19 లక్షల కోట్ల పెట్టుబడులు

మొదటిపేజీ తరువాయి

మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. దావోస్ పర్యటనల్లో ప్రభుత్వం 44 ఎంవోయూలు కుదుర్చుకోగా, వీటి ద్వారా 68,150 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు లభించాయని అన్నారు. 2024 దావోస్‌లో 18 ఎంవోయూల ద్వారా రూ.40,232 కోట్ల పెట్టుబడులు, 2025 దావోస్‌లో 26 ఎంవోయూల ద్వారా రూ.1,78,950 కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు వివరించారు. రూ.81,800 కోట్ల పెట్టుబడులతో 6 కంపెనీలకు భూములు కేటాయించగా, దీనివల్ల ప్రభుత్వానికి రూ.1,540 కోట్ల ఆదాయం సమకూరిందని చెప్పారు. మరో 3 కంపెనీలకు రూ.30 వేల కోట్ల పెట్టుబడుల కోసం భూములను గుర్తించినట్లు వెల్లడించారు. నిజామాబాద్ ఐటీ టవర్‌లో 11 కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తుండగా, 681 సీట్ల సామర్థ్యం కలిగిన ఈ టవర్‌లో ప్రస్తుతం 276 మంది ఉద్యోగులు పని చేస్తున్నారని తెలిపారు. తన శాఖల్లో పూర్తి పారదర్శకతకు కట్టుబడి ఉన్నానని శ్రీధర్ బాబు తెలిపారు. ఇప్పుడే కాదు, భవిష్యత్తులో కూడా ఇదే విధానాన్ని కొనసాగిస్తానని చెప్పారు. ఎంవోయూలు, పెట్టుబడులు, కంపెనీలపై వైట్ పేపర్ విడుదలకు సిద్ధమని, అవసరమైతే షార్ట్ డిస్కషన్‌కు కూడా వెనుకడుగు వేయబోమని స్పష్టం చేశారు. దావోస్ పర్యటనలపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండించిన మంత్రి శ్రీధర్ బాబు వరల్డ్ ఎకానమిక్ ఫోరం వంటి వేదికలు రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడంలో కీలకమని వివరించారు. ప్రపంచంతో అనుసంధానం లేకుండా ఐసోలేషన్‌లో ఉంటే పెట్టుబడులు రావని, పరిశ్రమలకు అనుకూల వాతావరణం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు వివరించినప్పుడే పారిశ్రామికవేత్తలు

ముందుకొస్తారని అన్నారు.

ఎంవోయూలు గ్రౌండింగ్ కావడానికి సమయం పడుతుంది

తప్పుడు ప్రచారం చేస్తున్నారు : ఎంవోయూలు కుదుర్చుకోవడం మాత్రమే కాకుండా, అవి గ్రౌండింగ్ కావడానికి సమయం పడుతుందని శ్రీధర్ బాబు తెలిపారు. ఈ విషయంపై అవగాహన లేకుండా కొందరు సభ్యులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అయితే ప్రతి ఎంవోయూను భూమిపై అమలు చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని, తమ నిబద్ధతపై ఎలాంటి సందేహం అవసరం లేదని స్పష్టం చేశారు. టైర్ 2, టైర్ 3 పట్టణాల్లో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి చెప్పారు. పదేళ్ల తర్వాత ఎంఎస్ఎంఈ పాలసీ తెచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. 'టీఫైబర్' ద్వారా లాస్ట్ మైల్ కనెక్టివిటీని దేశానికి ఆదర్శంగా నిలిపామని, రాష్ట్రంలోని రైతు వేదికలు, ప్రభుత్వ కార్యాలయాలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించామని వివరించారు.

ఒప్పందంపై త్వరగా తేల్చండి

మొదటిపేజీ తరువాయి

ఒకసారి అలా జరిగితే వెనక్కి తిరిగి చూసే ప్రసక్తే లేదు. దాని పర్యవసానం మాత్రం బాగుండదు అంటూ ఇరాన్‌ని ఆయన హెచ్చరించారు. అయితే అమెరికాతో ప్రత్యక్ష చర్చలు జరిపే ప్రసక్తి లేదని ఇరాన్ స్పష్టం చేసింది.

అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు తీవ్ర రూపం దాల్చుతున్నాయి. ఓవైపు అమెరికా, ఇజ్రాయెల్ కలిపి దాడులు చేస్తుండగా, అటు ఇరాన్ సైతం క్షిపణులతో విరుచుకుపడుతోంది. ఈ దాడుల నేపథ్యంలో పశ్చిమాసియాలోని అమెరికా సైనిక కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగింది. ముఖ్యంగా ఇరాన్ నిరంతరాయంగా జరుపుతున్న క్షిపణి, డ్రోన్ దాడుల కారణంగా అనేక అమెరికా సైనిక స్థావరాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయని 'ది న్యూయార్క్ టైమ్స్' పేర్కొంది. యూఎస్-ఇజ్రాయెల్ సంయుక్త దాడులకు ప్రతీకారంగా ఇరాన్ పశ్చిమాసియాలోని సుమారు 13 అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుందని అమెరికా సైనిక అధికారులు వెల్లడించారు. ఈ దాడుల కారణంగా వేలాది మంది అమెరికా సైనికులు తమ సంప్రదాయ స్థావరాలను వదిలిపెట్టి ఈ ప్రాంతంలోని హోటళ్లు, కార్యాలయాలకు తరలివెళ్లాల్సి వచ్చిందని తెలిపారు.

హోటళ్లలో దాక్కుంటున్న అమెరికా సైనికులు: ఇరాన్

మిలిటరీ స్థావరాల నుంచి అమెరికా సైనికులు పారిపోతున్నారని, గల్ఫ్ దేశాల్లోని హోటల్స్, కార్యాలయాల్లో దాక్కుంటున్నారని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి అన్నారు. 'యుద్ధం మొదలైనప్పటి నుంచి అమెరికా సైనికులు జీసీసీ (గల్ఫ్ దేశాల కూటమి) దేశాల్లో పౌరులను మానవ కవచాలుగా వాడుకుంటున్నారు. వినియోగదారులకు ప్రమాదం కలుగుతుందని మిలిటరీ ఆఫీసర్లకు అమెరికా హోటళ్లు బుకింగ్‌లు నిరాకరిస్తున్నాయి. జీసీసీ హోటల్స్ కూడా అలాగే వ్యవహరించాలి' అని అన్నారు.

మిత్రదేశాల జాబితా విడుదల చేసిన ఇరాన్

తమ మిత్రదేశాలకు మాత్రమే హోర్ముజ్ జలసంధి నుంచి నౌకల రవాణాకు అనుమతులు మంజూరు చేస్తామని ఇరాన్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా మిత్రదేశాలు, శతృదేశాల జాబితాను విడుదల చేసింది. ప్రధానంగా ఐదు దేశాల్ని మిత్రదేశాలుగా పేర్కొంది. ఇండియా, చైనా, రష్యా, పాకిస్తాన్, ఇరాక్ దేశాల్ని మిత్ర దేశాలుగా పేర్కొంది. ఈ దేశాలకు చెందిన నౌకల్ని హోర్ముజ్ జలసంధి గుండా అనుమతిస్తామని ఇరాన్ తెలిపింది. ఇప్పటికే రెండు నౌకలు బయల్దేరాయని వెల్లడించింది. అలాగే, బంగ్లాదేశ్ నౌకల్ని కూడా అనుమతిస్తామని చెప్పింది. ఈ దేశాలు ఇప్పటికే తమతో మాట్లాడాయని, తమతో సమన్వయం చేసుకుంటాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి అన్నారు. మిత్రదేశాలతోపాటు తాము అనుమతించేది లేని శత్రు దేశాల జాబితాను కూడా ఇరాన్ ప్రకటించింది. ఈ జాబితాలో అమెరికా, ఇజ్రాయెల్ , యుద్ధంతో సంబంధం ఉన్న కొన్ని గల్ఫ్ దేశాలు, యుద్ధంలో కీలక పాత్ర పోషించిన దేశాలతో సంబంధాలు కలిగి ఉన్న కూటమి దేశాలున్నాయి.

ఇరాన్ నేవీ చీఫ్ మృతి

ఇరాన్ ఎలైట్ నేవల్ ఫోర్స్ కమాండర్ అలీరేజా తంగ్‌సీరీ దక్షిణ ఇరాన్‌లో జరిగిన దాడిలో మరణించినట్లు ఇజ్రాయెలీ అధికారి ఒకరు వెల్లడించారు. పశ్చిమాసియాలో యుద్ధం నాలుగవ వారం కొనసాగుతున్న సమయంలో ఇరాన్‌కు చెందిన మరో అత్యున్నత అధికారి మరణించినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇరాన్‌కు చెందిన అత్యంత

శక్తివంతమైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డు కోర్ (ఐఆర్‌జీసీ)లో భాగమైన నౌకాదళానికి సారథ్యం వహిస్తున్న తంగ్‌సీరీ బంద్ అబ్బాస్‌లో జరిగిన వైమానిక దాడిలో మరణించినట్లు ఇజ్రాయెల్ అధికారి తెలిపారు. హోర్ముజ్ జలసంధి మూసివేతను పర్యవేక్షించే బాధ్యతను కమాండర్ తంగ్‌సీరీ నిర్వహిస్తున్నట్లు ఆ అధికారి చెప్పారు. అయితే ఈ వార్తను ఇరాన్ ఇప్పటివరకు ధృవీకరించలేదు. ఇజ్రాయెలీ రక్షణ దళాలు కూడా దాడిపై స్పందించలేదు.

ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్‌గా ఉండాలని నన్ను కోరారు : ట్రంప్

అంతకుముందు కొన్నిగంటల ముందు కూడా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇవే వ్యాఖ్యలు చేశారు. "యుద్ధం ముగింపు విషయంలో చర్చలు జరుపుతున్నాం. ఆ ఒప్పందం కోసం ఇరాన్ ప్రాధేయపడింది. కానీ, ఆ విషయాన్ని వారు బయటకు చెప్పట్లేదు. ఎందుకంటే సొంత ప్రజల చేతుల్లోనే హత్యకు గురవుతారని వారు భయపడుతున్నారు." అని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అంతేకాకుండా ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్‌గా ఉండాలని ఆ దేశ నేతలు తనను అడిగినట్లు డొనాల్డ్ ట్రంప్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అయితే, అలాంటి పదవిని తాను కోరుకోవట్లేదని, అందుకే వారి అభ్యర్థనను తిరస్కరించానంటూ ప్రగల్భాలు పలికారు. రిపబ్లికన్ పార్టీ విరాళాల సేకరణ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ డొనాల్డ్ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఐపీఎల్‌లో 'ఇంపాక్ట్ ప్లేయర్' రూల్ వల్ల క్రికెట్‌లో అసలైన నైపుణ్యం దెబ్బతింటోంది. క్రికెట్ పదకొండు మంది ఆడే ఆట. ఎక్స్‌ట్రా బ్యాటర్‌ను చేర్చడం వల్ల గేమ్ వన్ సైడ్‌గా మారుతుంది. భారీ స్కోర్ల కంటే సవాల్‌తో కూడిన వికెట్లపై ఆడే మ్యాచ్‌లే థ్రిల్లింగ్‌గా ఉంటాయి.
- గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్

ఏపీలో ఘోర బస్సు ప్రమాదం

మొదటిపేజీ తరువాయి

చెందినదిగుర్తించారు. ఈ ప్రమాదంలో కోరుట్ల, జగిత్యాల ప్రాంతానికి చెందిన నలుగురు ఉన్నట్లు సమాచారం. జీవనోపాధి కోసం ఆంధ్రా ప్రాంతానికి చెందిన సుతారీలు, కార్మికులు వచ్చి ఇక్కడ గృహనిర్మాణ పనులు చేస్తుంటారు. ఏపీలోని కనిగిరి, పామూరు వాసులు ఉన్నట్లు తెలిసింది. 3 అగ్నిమాపక యంత్రాలతో పోలీసులు మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. బస్సు, టిప్పర్ లారీ పూర్తిగా కాలిపోయాయి. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, గాయపడినవారికి రూ.2 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

ప్రమాదం అత్యంత విషాదకరం: మోదీ

మార్కాపురం బస్సు ప్రమాదంపై ప్రధాని నరేంద్రమోదీ స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం జిల్లాలో జరిగిన ప్రమాదం అత్యంత విషాదకరమని అన్నారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత ప్రజలు, వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ బాధితులకు ధైర్యం చెప్పారు. అదేవిధంగా ప్రమాదంలో గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు ఆకాంక్షించారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ. 50,000 పరిహారం ఇవ్వనున్నట్లు మోదీ స్పష్టం చేశారు.

సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టిప్పర్‌ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో బస్సులోని పలువురు ప్రయాణికులు మృతి చెందడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంపై ఆయన అధికారులతో మాట్లాడారు. గాయపడిన వారికి అందుతున్న వైద్య సాయంపై సమాచారం తెలుసుకున్నారు. హరికృష్ణట్రావెల్స్‌కు చెందిన ఈ బస్సు తెలంగాణలోని నిర్మల్ నుంచి బయలుదేరి నెల్లూరుకు వెళుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారిని తక్షణమే వివిధ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నామని జిల్లా పోలీసు అధికారులు వెల్లడించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి, నివేదిక సమర్పించాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు.

విచారం వ్యక్తం చేసిన మంత్రి లోకేశ్

బస్సు ప్రమాదంపై మంత్రి లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రయాణికులు మృతి చెందడం తీవ్రంగా కలచివేసిందని విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి

మార్కాపురం బస్సు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనలో పలువురు మంది మృతి చెందడం.. కొందరికి తీవ్ర గాయాలపాలవడంపై సీఎం విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని సీఎం ఆకాంక్షించారు. బస్సు నిర్మల్ నుంచి నెల్లూరు వైపు వెళుతున్న నేపథ్యంలో బస్సు ప్రమాదంలో మృతిచెందిన వారు..గాయపడిన వారి వివరాలు తెలుసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం సహాయం అందేలా చూడాలని సీఎం ఆదేశించారు.

దివ్యశక్తి ఆరాధనకు ప్రతీక మహాష్టమి

- రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- లోక్ భవన్ అధ్వర్యంలో తొలిసారిగా మహాష్టమి ఫలహార వేడుకలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 26: శ్రీరామ నవమిని పురస్కరించుకుని చైత్ర నవరాత్రి మహాష్టమి వేడుకలు దివ్యశక్తి ఆరాధనకు ప్రతీక అని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. గురువారం లోక్ భవన్ అధ్వర్యంలో తెలంగాణలో తొలిసారిగా సంస్కృతి కమ్యూనిటీ హాల్లో చైత్ర నవరాత్రి మహాష్టమి ఫలహార వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తన సతీమణి జానకి శుక్లాతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.గత 35 సంవత్సరాలుగా తాను ఈ వేడుకల్లో భాగస్వామ్యం అవుతున్నానని, తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తాను, ఈ పవిత్ర వేడుకను తొలిసారిగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లోనూ ఈ వేడుకలు తెలంగాణాలో కొనసాగాలని గవర్నర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సమాజంలో శాంతి, సోదరభావం పెంపొందించేందుకు అందరూ కృషి చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు. చివరిగా, మహాష్టమి సందర్భంగా ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు గవర్నర్ తెలిపారు. వేడుకలలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు, మాజీ గవర్నర్ దత్తాత్రేయ, బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, ఎమ్మెల్యే అద్దంకి దయాకర్, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, అదనపు డీజీపీ మహేష్‌భగవత్, జిల్లా కలెక్టర్ హరి చందన, రాజ్ భవన్ సీనియర్ అధికారులు, ఇతర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి శాసనసభ్యుల క్రీడోత్సవాలు

- మొదటి ఎడిషన్ లెజిస్లేచర్ స్పోర్ట్స్ మీట్ 2026
- రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 26: ఈనెల 28 29 తేదీల్లో జరగబోయే శాసనసభ్యులు శాసనమండలి సభ్యుల క్రీడా పోటీలు మొదటి ఎడిషన్ లెజిస్టేటర్ స్పోర్ట్స్ మీట్ 2026 నిర్వహణ సన్నాహక సమావేశం ఈరోజు అసెంబ్లీలోని కమిటీ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, అనునిత్యం రాజకీయాల్లో బిజీ ఉండే శాసన సభ్యులు శాసనమండలి సభ్యులకు ఈ క్రీడా పోటీలు ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇవ్వడమే కాకుండా రాష్ట్ర ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని క్రీడల పట్ల అవగాహన కలిగించేందుకు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించబోతున్నామని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ పోటీలు మొట్టమొదటిసారిగా నిర్వహించబోతున్నామని, శాసన సభ్యులు అందరూ ఈ క్రీడల్లో పాల్గొంటున్నారని వారు తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి వయసుల వారికి క్రీడల పట్ల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఇందుకోసం శాసన సభ సచివాలయము తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మరియు రాష్ట్ర సాంస్కృతిక శాఖ తోపాటు వివిధ శాఖల సమన్వయంతో శాసనసభ్యులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని తెలిపారు.ఈ సమీక్షా సమావేశంలో శాసనమండలి విప్ అద్దంకి దయాకర్, శాసనసభ్యులు ఎమ్మెస్ రాజ్ ఠాకూర్ యశస్విని రెడ్డి , పాల్వాయి హరీష్ రావు, శాసనమండలి సభ్యులు తాత మధుసూదన్ రావు భాను ప్రసాద్ రావు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి శాసనమండలి కార్యదర్శి నరసింహాచార్యులు శాసనసభ కార్యదర్శి ఆర్ తిరుపతి వివిధ క్రీడా వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

GITAM
DEEMED TO BE UNIVERSITY

వ్యాపార నిర్ణయంలో ఏఐ &ఎంఎల్ వినియోగంపై

గీతంలో కార్యశాల

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 26: ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 26 : గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ లో 'వ్యాపార నిర్ణయం తీసుకోవడం కోసం కృత్రిమ మేధస్సు & యంత్ర అభ్యాసం'పై మే నెల 25 నుంచి 29వ తేదీ వరకు, ప్రతిరోజూ సాయంత్రం 6.00 నుంచి రాత్రి 9.00 గంటల వరకు ఐదు రోజుల ఆన్‌లైన్ ఆచరణాత్మక కార్యశాల (యాజమాన్య వికాస కార్యక్రమం - ఎండీపీ)ను నిర్వహిస్తున్నట్టు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు.ఆధునిక వ్యాపార నిర్ణయం తీసుకోవడంలో కృత్రిమ మేధస్సు (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) యొక్క పెరుగుతున్న ప్రాధాన్యాన్ని సదస్యులకు పరిచయం చేయడం ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. ఏఐఆధారిత విశ్లేషణలు వినియోగదారులను ఆకట్టుకోవడం, డిమాండ్ అంచనా, నష్ట అంచనా, ఆయా సంస్థలకు అనుగుణంగా మార్కెటింగ్ వంటి రంగాలకు ఎక్కువ ప్రాధాన్యం ఉన్నందున, డేటాఆధారిత నిర్ణయాల కోసం ఈ సాంకేతికతలను వినియోగించడానికి ఆచరణాత్మక అంతర్దృష్టులతో ఈ శిక్షణలో పాల్గొనేవారిని సన్నద్ధం చేయడానికి ప్రయత్నిస్తామని వివరించారు.

సీఎం రేవంత్ శ్రీరామనవమి శుభాకాంక్షలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 26: రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. భద్రాద్రి సీతారాముల ఆశీస్సులతో దేశంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థించారు. భద్రాద్రి రామాలయాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసేందుకు ప్రజా ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.351 కోట్లు కేటాయించామన్నారు. భద్రాద్రి శ్రీరాముని క్షేత్ర ప్రాధాన్యం దేశమంతటికీ చాటేలా ఘనంగా నవమి వేడుకలు జరుపుకోవాలన్నారు.

భక్తులకు అసౌకర్యం తలెత్తకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

సీతారామచంద్ర కళ్యాణం సందర్భంగా

మంత్రి పొన్నం ఇంట్లో ఎదుర్కోలు మహోత్సవం

- పాల్గొన్న ప్రముఖ పాత్రికేయులు, సినీ విమర్శకులు పొన్నం రవిచంద్ర

ప్రతిపక్షం ప్రతినిధి, కరీంనగర్, మార్చి 31: సీతారామ చంద్ర కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఎదుర్కోల్ల కార్యక్రమం మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంట్లో గురువారం ఘనంగా జరిగింది. సప్తగిరి కాలనీ రామాలయంలో ఉత్సవ విగ్రహాలను ఎదుర్కోలు కార్యక్రమంలో తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఈ ఎదుర్కోల్ల కార్యక్రమం పూజలో పొన్నం ప్రభాకర్ సోదరులు ప్రముఖ పాత్రికేయులు, సినీ విమర్శకులు పొన్నం రవిచంద్ర అలాగే కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఎదుర్కోలు పూజను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గౌతమ్ రావు, రాజిరెడ్డి, తుమ్మల రమేశ్ రెడ్డి, పొన్నం సత్యం, కర్ర రాజశేఖర్, చక్రధర్, అనిల్ కుమార్, శ్రీనివాస్ గౌడ్, రాచకొండ ప్రభాకర్, అజిత్ కుమార్, వెంకట రమణ, మాడిశెట్టి గోపాల్, గాజుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రకు తరలిరండి

- హిందు వాహిని రాష్ట్ర నాయకుడు వెంకటేష్ ముదిరాజ్

ప్రతిపక్షం, షాద్‌నగర్, మార్చి 26: షాద్ నగర్ పట్టణంలో హిందూ వాహిని ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే ధర్మానికి ప్రతీక అయిన శ్రీరామ చంద్రమూర్తి శోభాయాత్రనకు ప్రతి ఒక్క హిందువు యువతీ, యువకులు తన బాధ్యతగా తరలిరావాలని హిందు వాహిని రాష్ట్ర నాయకుడు చెట్ల వెంకటేష్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా శోభయాత్రను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గుండు అశోక్, క్యామ మహేష్, శివశంకర్, సల్లా మహేష్, చింతకుంట రాఘవేందర్, పసిలోటి శ్రావణ్, సిహెచ్ కుమార్, కర్ణకోట అంజి, ప్రవీణ్ సింగ్, లింగారం సాయి, శ్రీనాథ్, అల్లాడ శ్రీను, గుండు అశోక్ ,శ్రీహరి, వంశీ, సాయి వంశీ, మంజునాథ్, మరియు హిందువాహిని కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఐని కలిసిన సర్పంచ్ పద్మకృష్ణ

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చ్ 26: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని మాణిక్యమ్మగూడా గ్రామ సర్పంచ్ జెన్నపల్లి పద్మకృష్ణ మహేశ్వరం సీఐ ఎస్ రాఘవేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి అనంతరం శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేసినట్టుగా పత్రిక విలేకరులకు తెలియజేశారు.

మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి మాతృమూర్తి ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. గురువారం టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ రంజిత్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయన తల్లిగారి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.
- ప్రతిపక్షం, హైదరాబాద్

ఓపెన్ యూనివర్సిటీలపై పెరిగిన యూజీసీ నియంత్రణ

- డీమ్డ్ యూనివర్సిటీలుగా పలు కార్పొరేట్ కళాశాలలు
- ఇది మంచి పరిణామం కాదు
- అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 26: యూజీసీ దూరవిద్య విశ్వవిద్యాలయాలను కట్టడి చేయడానికి అనేక సరికొత్త నిబంధనలు పెడుతుందని, తద్వారా ప్రభుత్వ రంగ యూనివర్సిటీలు ఇబ్బందులకు గురవుతున్నాయని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ (ఐడియా), డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో), తెలంగాణ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్, గుజరాత్‌కు చెందిన ఇన్ఫ్లిబ్నెట్ భాగస్వామ్యంతో "సరిహద్దులకు అతీతంగా సరికొత్త దిశలో సార్వత్రిక విద్య" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉత్తరాఖండ్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ.నవీన్ చంద్ర లోహాని పాల్గొన్నారు. ప్రొ. చక్రపాణి మాట్లాడుతూ కొన్ని కార్పొరేట్ కళాశాలలు డీమ్డ్ యూనివర్సిటీలుగా అతి తక్కువ సమయంలో మారుతున్నాయని, ఈ విషయం ఆయా రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వాలకు కూడా తెలియట్లేదన్నారు. అలా మారడం వల్ల ఉచిత విద్య కాస్త ఓ కార్పొరేట్ విద్యగా, అదో వ్యాపార వస్తువుగా మారిందని, ఇది పేద విద్యార్థులకు దూరం అవడమే కాకుండా ఉన్నత విద్య అభ్యసించాలి అనుకునే వారికి భారంగా మారుతోందని ప్రొ. ఘంటా చక్రపాణి ఆందోళన వ్యక్త పర్చారు. ప్రొ.లోహాని మాట్లాడుతూ చైనాలో సాంప్రదాయ విశ్వవిద్యాలయాల కంటే ఓపెన్ యూనివర్సిటీలు చాలా మెరుగ్గా ఉన్నాయని ప్రొ. లోహాని అభిప్రాయపడ్డారు. నిధుల కొరత కారణంగా దేశంలో సార్వత్రిక విద్యా సంస్థలను నడపడంలో సవాళ్లను ఎదుర్కొంటున్నామని ఆయన వివరించారు. మారుతున్న ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాల్సిన భాధ్యత దూర విద్యా సంస్థలపై ఉందని పేర్కొన్నారు. రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలు సాంకేతిక సెషన్స్ నిర్వహించగా ఇందులో దేశ వ్యాప్తంగా పలు విశ్వవిద్యాలయాల నుంచి హాజరైన అధ్యాపకులు, పరిశోధకులు తమతమ పరిశోధనా పత్రాలను సమర్పించారు.

యాదాద్రి జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కన్వీనర్‌గా శ్రీను అమనగంటి

ప్రతిపక్షం, యాదాద్రి భువనగిరి, మార్చి 26: యాదాద్రి భువనగిరి జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా కన్వీనర్‌గా శ్రీను అమనగంటి, కోకన్వీనర్ గా చేక్ర అశ్విని నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా నూతన కన్వీనర్ శ్రీను అమనగంటి మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్ రావు, ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్, జాయింట్ సెక్రటరీ రామరెడ్డి, జాయింట్ సెక్రటరీ (టెక్నికల్) తోట సతీష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌జంగిల్ రాజ్‌గా మారిపోయింది. కాగితాలపై మాత్రమే పోలీసులు కన్పిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో 17ఏళ్ల గిరిజన బాలికపై హత్యాచారం వ్యవస్థల వైఫల్యాన్ని సూచిస్తోంది. ఇక ఇవాళ మార్కాపురం ఘటనలో మరో భయానక వైఫల్యం బయటపడింది. పలుమార్లు 100కు ఫోన్ చేసినా స్పందించలేదు.
- వైసీపీ చీఫ్ వైఎస్‌జగన్

ఓపెన్ వాయిస్

అత్యాచారం కంటే వరకట్న మరణాలే ఎక్కువ

బయట ఎలాగూ భద్రత లేదు.. అమ్మ కడుపులో కూడా సెక్యూరిటీ లేకపోతే ఎలాగమ్మా.. కార్తికేయ సినిమాలో గర్భవిచ్ఛిత్తి చేసుకోవడానికి వచ్చిన ఓ మహిళలను ఉద్దేశించి హీరో పలికే డైలాగ్ అది. అది కేవలం సినిమా డైలాగ్ గా మాత్రమే చూడకూడదు. తరాలు మారినా.. యుగాలు మారినా.. అంతరిక్షంలోకి దూసుకెళ్తున్నా సరే సమాజంలో పాతుకుపోయిన కొన్ని దురాచారాలు మాత్రం అంతమవడం లేదు. వీటిల్లో ప్రధానంగా చెప్పుకోవాల్సింది వరకట్న దురాచారం. నేటి రాకెట్ యుగంలో కూడా వరకట్న వేధింపుల వల్ల ఎందరో మహిళలు బలువుతున్నారు. తాజాగా ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో అదనపు కట్నం కోసం భర్త, అత్తింటి వారు కలిసి మహిళను అత్యంత దారుణంగా హత్య చేసిన సంగతి తెలిసిందే. అలానే రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌కు చెందిన ఓ ప్రభుత్వ టీచర్ వరకట్న వేధింపులు తాళలేక తన కూతురితో సహా ఆత్మహత్య చేసుకుంది.ఎందుకంటే బయట సమాజంలో పరిస్థితి ఇప్పుడు అంతకంటే దారుణంగా ఉంది. ఆడవాళ్లు అంటే అలుసుగా.. కడుపులో నలుసుగా చూస్తున్న క్రమంలో.. గర్భ విచిత్తులు పెరిగిపోతున్నాయి. తద్వారా ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతుంది. దీంతో లింగ నిష్పత్తి లో విపరీతమైన అంతరాయం ఉండడంతో చాలామంది అబ్బాయిలకు వివాహాలు జరగడం లేదు.గడిచిన కొంతకాలంగా రెండు తెలుగు రాష్ట్రాలలో మాత్రమే కాకుండా యావత్ దేశం మొత్తం అమ్మాయిల కొరత విపరీతంగా ఉంది. పెళ్లీడుకొచ్చిన అబ్బాయిలకు అమ్మాయిలు దొరకడమే కష్టంగా మారింది. ఫలితంగా చాలామంది బ్రహ్మచారులుగానే మిగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలోనే చాలామంది తమకు పెళ్లి జరిగితే చాలు అనే స్థాయికి దిగజారి పోయారు.కట్నాలు డిమాండ్ చేస్తే స్టేజి నుంచి ఎదురు కట్నం ఇచ్చే వరకు యువకుల పరిస్థితి మారిపోయింది. ఇంత చేసినప్పటికీ చాలామందికి పెళ్లి జరగడం లేదు.ఈ పెళ్లిళ్ల సంగతి కాస్త అటు పెడితే.. వివాహం జరిగిన తర్వాత అత్తింటి వారింట్లో అమ్మాయిలకు ఏమాత్రం భద్రత ఉండటం లేదు. ఇదేదో మేము చేస్తున్న ఆరోపణ కాదు.. టిడిపి పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి లోక్‌సభలో ప్రశ్న అడిగారు. దానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ దిగ్భ్రాంతికరమైన వాస్తవాన్ని వెల్లడించారు.రెండు తెలుగు రాష్ట్రాలలో గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో 1304 మంది మహిళలు వరకట్నం వేధింపులతో మరణించారట. 2019 నుంచి 2023 వరకు ఆంధ్రప్రదేశ్లో 526.. తెలంగాణ రాష్ట్రంలో 776 కేసులు నమోదయ్యాయి. ఇక శిక్షల ఖరారు రేటు ఆంధ్రప్రదేశ్లో 11.5.. తెలంగాణలో 14.4% గా ఉంది. వరకట్న మరణాలలో ఉత్తర ప్రదేశ్, బీహార్ రాష్ట్రాలు టాప్ స్థానంలో ఉన్నాయి. ఇక 2023లో దేశవ్యాప్తంగా 6156 మంది మహిళలు వరకట్నం వేధింపుల వల్ల చనిపోయారు. ఇందులో కొంతమంది ఆత్మహత్య చేసుకుంటే.. మిగతావారు హత్యకు గురయ్యారు.దేశంలో అత్యాచారాల కంటే వరకట్న మరణాలే ఎక్కువ అని వెల్లడించింది. ప్రతిరోజు సగటున 19 మంది మహిళలు వరకట్నా దాహానికి బలైపోతున్నారు. 20172022 మధ్య ఏటా 6,516 వరకట్నమరణాలు సంభవించాయి. 2024లో నమోదైన కేసుల్లో 17 శాతం వరకట్న వేధింపుల కేసులే. బాధితులకు సత్వర న్యాయం అందడం లేదని నివేదికలు చెబుతున్నాయి.ఈ క్రమంలో హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ క్రైమ్ బ్యూరో రికార్డ్స్ సంచలన విషయాలు వెల్లడించింది. దేశంలో అత్యాచార ఘటనల కన్నా వరకట్న మరణాలే అధికంగా ఉన్నాయని.. ప్రతి రోజు సగటున 19 మంది మహిళలు వరకట్న దాహానికి బలైపోతున్నారని ఎన్‌సీబీఆర్ వెల్లడించింది. దేశంలో వరకట్న నిషేధ చట్టం అమలులో ఉన్నా సరే దారుణాలు మాత్రం ఆగడం లేదు.బ్యూరో వెల్లడించిన తాజా వివరాల ప్రకారం 20172022 సంవత్సరాల మధ్య దాదాపు ప్రతి ఏడాది భారత్‌లో 6,516 వరకట్న మరణాలు చోటుచేసుకుంటున్నాయి. రేప్, సామూహిక అత్యాచారం తరువాత హత్యకు గురై చనిపోయిన ఆడవారి కంటే ఈ మరణాలు 25 రెట్లు ఎక్కువ అని నివేదిక వెల్లడించింది. ఇదిలా ఉంటే 2024 సంవత్సరంలో నమోదైన 25,743 కేసుల్లో.. 4,383 కేసులు వరకట్న వేధింపుల మీద నమోదైనవే. అంటే మొత్తం నమోదైన కేసుల్లో 17 శాతం కేసులు వరకట్న వేధింపుల కేసులే ఉండటం గమనార్హం.వరకట్న వేధింపుల కేసుల విషయానికి వస్తే ఉత్తర భారతదేశంతో పోలిస్తే దక్షిణాదిలో ఈ కేసుల సంఖ్య తక్కువగా ఉంది. అలానే నగరాల్లో కూడా వరకట్న వేధింపుల కేసులు అధిక సంఖ్యలో నమోదవుతున్నాయి. దేశంలోని మొత్తం 19 నగరాల్లో ఢిల్లీలో అత్యధికంగా 30 శాతం వరకట్న వేధింపుల కేసులు నమోదవుతున్నాయి.

ప్రతిపక్షం
హైదరాబాద్
శుక్రవారం
27.03.2026

ఫిరాయింపుల నీడలో నిబద్ధత గల రాజకీయం

ప్రస్తుత పరిస్థితుల్లో జీవన్ రెడ్డి తీసుకున్న ఈ కఠిన నిర్ణయం తెలంగాణ సమాజంలో రాజకీయ నైతికతపై చర్చను పునఃప్రారంభించింది. విలువలకు ప్రాధాన్యత ఇచ్చే ఓటర్లు, విద్యావంతులు ఈ పరిణామాన్ని నిశితంగా గమనిస్తున్నారు. పార్టీలు మారడం అనేది కేవలం సాంకేతిక అంశం కాదు, అది ప్రజలు ఇచ్చిన తీర్పును ధిక్కరించడమేనని జీవన్ రెడ్డి వాదనలో స్పష్టత కనిపిస్తోంది. అధికారం శాశ్వతం కాదని, వ్యక్తిత్వం మరియు విలువలే రాజకీయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయని ఆయన తన రాజీనామా ద్వారా చాటిచెప్పారు.

రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

తెలంగాణ రాజకీయ యవనికపై నాలుగు దశాబ్దాలకు పైగా చెరగని ముద్ర వేసిన సీనియర్ నేత, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడం రాష్ట్ర రాజకీయాల్లో ఒక పెను సంచలనంగా మారింది. ఇది కేవలం ఒక నియోజకవర్గ స్థాయి నాయకుడి అసంతృప్తిగానో, లేదా ఒక వ్యక్తిగత నిర్ణయంగానో పరిగణించ లేము. ఈ పరిణామం వెనుక దశాబ్దాల రాజకీయ నైతికత, పార్టీ సిద్ధాంతాల పట్ల అంకితభావం, మరియు ప్రస్తుత రాజకీయాల్లో చోటు చేసుకుంటున్న విలువ కట్టలేని ఫిరాయింపుల సంస్కృతిపై ఒక గంభీరమైన ధిక్కార స్వరం వినిపిస్తోంది. 1980వ దశకంలో ఇందిరా గాంధీ ఆశయాలతో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన జీవన్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ఒక బలమైన ధ్వజధారిగా నిలిచారు. జగిత్యాల గడ్డపై ఐదు పర్యాయాలు శాసన సభ్యుడిగా విజయం సాధించి, ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన ఆయన, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కూడా వెనుకాడకుండా నిలబడ్డారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ పతాక స్థాయి సమయంలో, కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు కరీంనగర్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో కేసీఆర్‌పై పోటీ చేసి పార్టీ పట్ల తన విధేయతను చాటుకోవడం ఆయన నిబద్ధతకు నిదర్శనం. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాంగ్రెస్ తీవ్ర ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్నప్పటికీ, ఉమ్మడి జిల్లాలో ఏకైక ఎమ్మెల్యేగా గెలిచి పార్టీ ఉనికిని కాపాడారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ, కుంగిపోకుండా పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికై శాసన మండలిలో కాంగ్రెస్ పక్షనేతగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయం. అయితే, 2023లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు అనూహ్యంగా మారాయి. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పడిన ప్రభుత్వం, రాజకీయ అవసరాల కోసం ఫిరాయింపులను ప్రోత్సహించడం జీవన్ రెడ్డి వంటి సిద్ధాంత కర్తలకు మింగుడుపడని అంశంగా మారింది. ముఖ్యంగా జగిత్యాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను పార్టీలోకి ఆహ్వానించడం, ఆయనకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం పుండు మీద కారం చల్లినట్లయింది. దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుని, ప్రత్యర్థుల దాడులను తట్టుకుని నిలబడిన కార్యకర్తలను విస్మరించి, పార్టీ మారిన వారికి పెద్దపీట వేయడం వల్ల పార్టీ అంతర్గత నిర్మాణం కుప్పకూలుతోందని ఆయన ఆవేదన చెందారు. గాంధీ భవన్‌లో జరిగిన కీలక సమావేశానికి ఫిరాయింపు ఎమ్మెల్యేలను ఆహ్వానించడం, చట్టసభల్లో అనర్హత వేటు అంశం పెండింగ్‌లో ఉన్నప్పుడే వారికి ప్రాధాన్యత కల్పించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన బలంగా నమ్మారు. "జై సంవిధాన్" అని నినదించే పార్టీ, రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ఆశయాలను తుంగలో తొక్కడం ఆయనను తీవ్రంగా కలచివేసింది. మున్సిపల్ ఎన్నికల అభ్యర్థుల ఎంపికలో సైతం పాత కార్యకర్తలను కాదని, కొత్తగా వచ్చిన వారి మాటకే విలువ ఇవ్వడం వల్ల పార్టీలో ప్రజాస్వామ్యం కనుమరుగవుతోందనే విమర్శలు వ్యక్తమయ్యాయి. దీనికి తోడు, పార్టీ పట్ల ఎంతో నిబద్ధత కలిగిన మారుగంగారెడ్డి అనే జీవన్ రెడ్డి అనుచరుడు దారుణ హత్యకు గురికావడం, జీవన్ రెడ్డిని తీవ్ర మానసిక క్షోభకు గురిచేశాయి. తనను నమ్ముకున్న కార్యకర్తలకు రక్షణ కల్పించలేనప్పుడు పదవుల్లో కొనసాగడం నిరర్థకమని భావించిన ఆయన, తన 40 ఏళ్ల కాంగ్రెస్ పార్టీతో ఉన్న రాజకీయ ప్రస్థానానికి స్వస్తి పలకాలని నిర్ణయించు కున్నారు. రాజీవ్ గాంధీ ప్రవేశపెట్టిన పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం యొక్క అసలు స్ఫూర్తిని ప్రస్తుత రాజకీయ నాయకత్వం విస్మరించడం వల్లనే ఇటువంటి అవాంఛనీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రాహుల్ గాంధీ జాతీయ స్థాయిలో 'న్యాయ్' యాత్రల ద్వారా విలువలతో కూడిన రాజకీయాల గురించి మాట్లాడుతుంటే, రాష్ట్రస్థాయిలో అందుకు విరుద్ధంగా జరుగుతున్న పరిణామాలు పార్టీ విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయి. జీవన్ రెడ్డి రాజీనామా అనేది కేవలం ఒక వ్యక్తి నిష్క్రమణ కాదు, అది అధికారం కోసం నైతికతను పణంగా పెట్టే రాజకీయ ధోరణిపై జరిగిన ఒక నైతిక పోరాటం. పార్టీలో క్రమశిక్షణ, కార్యకర్తల ఆత్మగౌరవం, మరియు సిద్ధాంతాల పట్ల స్పష్టత లేకపోతే ఎంతటి ప్రజాదరణ ఉన్నా అది స్వల్పకాలికమే అవుతుందని ఈ ఘటన హెచ్చరిస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం స్థిరంగా కొనసాగాలంటే ప్రజా సంక్షేమ పథకాలతో పాటు, క్షేత్రస్థాయిలో పార్టీని నమ్ముకున్న నాయకులకు, కార్యకర్తలకు సముచిత గౌరవం కల్పించాల్సిన బాధ్యత అధిష్టానంపై ఉంది. జీవన్ రెడ్డి వంటి మేధావి, నిబద్ధత కలిగిన నాయకుడు దూరం కావడం కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని దెబ్బ. ఇది రాజకీయ పక్షాలన్నింటికీ ఒక ఆత్మపరిశీలన సమయం. పార్టీ ఫిరాయింపులు, అధికార రాజకీయాల కంటే ప్రజాస్వామ్య విలువలు, కార్యకర్తల శ్రేయస్సు మిన్న అని చాటిచెప్పిన జీవన్ రెడ్డి నిర్ణయం, రాబోయే రోజుల్లో తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో పెను మార్పులకు నాంది కావచ్చు. పార్టీ వ్యవస్థను బలోపేతం చేసుకోవడంలో విఫలమైతే, ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది. ఒక గొప్ప రాజకీయ యుగానికి ముగింపు పలకడం కంటే, ఆ వ్యవస్థలోని లోపాలను సరిదిద్దుకుని ముందుకు సాగడమే నిజమైన రాజకీయం. ప్రస్తుత పరిస్థితుల్లో జీవన్ రెడ్డి తీసుకున్న ఈ కఠిన నిర్ణయం తెలంగాణ సమాజంలో రాజకీయ నైతికతపై చర్చను పునఃప్రారంభించింది. విలువలకు ప్రాధాన్యత ఇచ్చే ఓటర్లు, విద్యావంతులు ఈ పరిణామాన్ని నిశితంగా గమనిస్తున్నారు.

పార్టీలు మారడం అనేది కేవలం సాంకేతిక అంశం కాదు, అది ప్రజలు ఇచ్చిన తీర్పును ధిక్కరించడమేనని జీవన్ రెడ్డి వాదనలో స్పష్టత కనిపిస్తోంది. అధికారం శాశ్వతం కాదని, వ్యక్తిత్వం మరియు విలువలే రాజకీయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయని ఆయన తన రాజీనామా ద్వారా చాటిచెప్పారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఇప్పటికైనా మేల్కొని, క్షేత్రస్థాయిలో ఉన్న అసంతృప్తిని చల్లార్చకపోతే, భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడతామని వాగ్దానం చేసిన వారు, స్వయంగా ఆ విలువలను కాలరాస్తున్నారనే ముద్ర పడకుండా జాగ్రత్త పడాలి. చివరగా, జీవన్ రెడ్డి రాజీనామా తెలంగాణ రాజకీయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది, ఇది పదవుల కంటే సిద్ధాంతాలే గొప్పవని నమ్మే ప్రతి రాజకీయ కార్యకర్తకు ఒక ప్రేరణగా మిగిలిపోతుంది.

(సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్)

కల్తీ కరాళ నృత్యం.. నిస్తేజంలో ప్రభుత్వ యంత్రాంగం

డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్
8886666006

'ఆహారం మనకు ఆరోగ్య ప్రదాయిని.. ఆహారం మనకు శక్తి వనరు.. ఆహారం మన శరీరానికి జీవ యంత్రం లాంటిది.' అందుకే మన భారత సనాతన ధర్మాలలో సైతం అన్నదానానికి మించిన దానం లేదని, అన్నం పరబ్రహ్మ స్వరూపంగా చెప్పబడింది. సాక్షాత్తు అన్నపూర్ణ దేవి స్వరూపంగా మనం ఆహారాన్ని చూస్తాం. అలాంటి ఆహారం నేడు మన రాష్ట్రంలో విష తుల్యంగా మారిపోయింది. కల్తీకి కాదేది అనర్హం అన్నట్లుగా, ఉదయం లేవగానే వాడే పాల దగ్గర నుండి, రాత్రి పడుకునే వరకు మనం వాడే నిత్యవసరాలన్ని కలుషితం అవుతున్నాయి. ఆహార కల్తీలో ఏ వస్తువుకు ధర ఎక్కువగా ఉంటుందో, ఆ వస్తువు కల్తీ ఎక్కువగా అవ్వటానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది. నూనె, పాలు, కారం, నెయ్యి, తేనే, పప్పు దినుసులు, పన్నీరు, బట్టర్ సహా త్రాగే మంచినీరు సైతం కల్తీ అవుతున్నదంటే విస్మయానికి గురవ్వక తప్పదు. కల్తీలో కూడా రకాలున్నాయి. వాటిలో మొదటిది ఉత్పత్తి దశలో సరైన పద్ధతులు పాటించక పోవటం వల్ల లేదా పండించే భూమి, నీళ్లు, చల్లే పురుగుల మందులు వల్ల ఆహారం కలుషితం అవుతుంది. రెండవది ప్రాసెసింగులో అవుతుంది. అది ఎలాగంటే రంగులు కలపటం, పాలిష్ చేయటం, ఈ పాలిష్ లలో పప్పు దినుసులు తాజాగా కనిపించడం కోసం జంతువుల నుండి తీసిన కొవ్వును వాడి లేయర్ పాలిష్ చేయడం, నిల్వ చేయటం కోసం రసాయనాలను కలపడం వల్ల కల్తీ జరుగుతుంది. ఇక మనం ఆర్గానిక్ ఫుడ్ అని భావించి తీసుకుంటున్న ఉత్పత్తుల్లో సైతం మాయ కనిపిస్తుంది. ఆర్గానిక్ ప్రొడక్షన్ లో సింథటిక్ కెమికల్స్ వాడుతున్నారు. దిగుబడి అధికంగా వస్తున్నాయని జన్యు మార్పిడి పంటలు వేస్తున్నారు. ఇండస్ట్రియల్, మెటల్ వేస్ట్ తో కలిసిన కలుషిత నీళ్లు వాడి పండించే దిగుమతులు, నేలను సురక్షితంగా ఉంచకుండా ముందే దుక్కి మందులు వాడటం, ఇలా అనేక రసాయనాలతో కలుషితం చేసి వాటిని కూడా "ఆర్గానిక్" అని ఒక లేబుల్ వేసి మార్కెటింగ్ చేసుకుంటున్నారు కొందరు ప్రబుద్ధులు. అందుకే మెరిసేదంతా బంగారం కాదు.. తినేదంతా ఆరోగ్యం కాదు అని గుర్తు పెట్టుకోవల్సిన అవసరం ఉన్నది. ఆర్గానిక్ అంటే భూమిపైన కానీ, పంటపైన కానీ ఎలాంటి రసాయనాలు వాడని ఉత్పత్తులనే ఆర్గానిక్ గా గుర్తించాలి. కంపోస్ట్ ఎరువులను వాడి ముందు నేలను సారవంతం చేసాక పండించిందే ఆర్గానిక్ అని తెల్సుకోవాలి. దక్షిణాది ఫుడ్ అనగానే శాఖాహారులకు గుర్తొచ్చేది అన్నం, పప్పు. ముఖ్యంగా కంది పప్పు పసుపుపచ్చగా కనిపించేందుకు "మేటానిల్ ఎల్లో" అనే కెమికల్ కలుపుతున్నారు. దీన్ని తినటం ద్వారా కొంత

కాలానికి "న్యూరో టాక్సిసిటీ" అనే నరాల బలహీనత వ్యాధి వస్తుంది. ఇంట్లో కారం, ఉప్పు లేనిదే ఏ వంట పూర్తి అవ్వదు. అలాంటి కారానికి బదులు రెడ్ బ్రిక్ పౌడర్, ఉప్పుకి బదులు "టాల్కమ్ పౌడర్" తయారీలో మిగిలిపోయిన వేస్ట్ ను కలుపుతున్నారు. మిరియాలలో బొప్పాయి విత్తనాలను, బ్లాక్ బెర్రీ గింజలను వాడుతున్నారు, ప్రపంచంలోనే ఖరీదైన సుగంధ ద్రవ్యాలలో ఒకటి కుంకుమ పువ్వు.. ఈ కుంకుమ పువ్వును మొక్కజొన్నకంకిలో వచ్చే సన్నని పీచును తీసుకుని రంగు కోసం "సూడన్ రెడ్ జి" అనే రసాయనపు కలర్ ను.. అంటే చెప్పులకు, షూస్ కి, బెడ్ షీట్లకు వేసే కలర్ తో కలిపి కలుషితం చేస్తున్నారు. ఏడాదిలో ఒక సీజనే కాకుండా అన్ని సీజన్లలో ఎవర్ గ్రీన్ బిజినెస్ ఐస్ క్రీం వ్యాపారం. పిల్లలు పెద్దలు ఇష్టంగా తినే పదార్థాలలో ఐస్ క్రీం ఒకటి. ముఖ్యంగా పిల్లలకు అత్యంత ఇష్టమైన ఈ ఐస్ క్రిమ్ తయారీలో 90 శాతం కెమికల్స్ ఉపయోగిస్తారు. ఐస్ క్రీం తయారీలో "ఇథైల్ ఏసీటేట్, బ్యూటాల్డీ హైడ్, ఎమిల్ ఏసీటేట్, నైట్రైట్, వంటి రసాయనాలను తీవ్రంగా వాడుతున్నారు. ఇథైల్ ఏసీటేట్ తో లంగ్స్, హార్ట్, కిడ్నీ సంబదించిన వ్యాధుల బారిన పడుతున్నారు ప్రజలు. అందులో గమ్ కోసం వాడేందుకు జంతువుల తోక, మూతి దగ్గర నుండి సేకరించిన కాలేబరాలతో ఉడికించి జిగురును గమ్ గా వాడుతున్నారు. తయారీ దారి కంపెనీ అందంగా ఒక లేబుల్ వేసి ప్రదర్శన చేయగానే లొట్టలేసుకుంటూ తింటున్నం. రుచికరమైన, ఆరోగ్యకరమైన ఆహారం అంటే మన పూర్వికులు తిన్నదే, ఇప్పుడు ప్రకృతి ద్వారా లభించే తేనె సైతం స్వచ్ఛమైన తేనె లభించిన ఆది మన దగ్గరకు చేరే లోపు కల్తీ అవుతున్నది. గిరిజన బిడ్డలు అడవిలో దొరికే తేనెను సంతలో అమ్మేదానికి మనకు మార్ట్ లలో, సూపర్ మార్కెట్లలో దొరికేదానికి చాలా వ్యత్యాసం ఉంటుంది. శుభాకార్యం అనగానే గుర్తొచ్చేది స్వీట్లు. ఏ సీజనైనా స్వీట్ల రేట్లు తగ్గవు. అందులో వాడే సిల్వర్ కోటింగ్ కూడా కెమికల్ నుండి వచ్చిందే. మన రాష్ట్రంలో కల్తీ అయ్యే వాటిలో ముందు వరుసలో పాలు ఉన్నాయి. కల్తీ పాల తయారీలో డిటర్జెంట్, యూరియా, కొవ్వు కలుపుతున్నారు. పాల ఉత్పత్తులు సరే సరి. కోవా పన్నీరు వంటివి కూడా ఈ కల్తీ పాలతోనే తయారు చేస్తున్నారు. తర్వాత టీ పౌడర్, కాఫీ పౌడర్ చింత పిక్కలు, ఆవాలు కలిపి కాఫీ పౌడర్ తయారు చేస్తున్నారు. ఇటీవల మన హైదరాబాద్ లో ఇలాంటి కల్తీలు అనేకం వెలుగులోకి వచ్చాయి. ప్రపంచస్థాయి నగరంగా హైదరాబాద్ పేరు మార్మోగిందే ఇక్కడి ఆహారం బిర్యాని, చాయి, హలీమ్ ఇలా అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. అలాంటి నగరం కల్తీ మాఫియా చేతుల్లో చిక్కుకొని ప్రజల ప్రాణాలను హరిస్తున్నది. ఇటీవల జరిగిన తనిఖీల్లో జియగూడలోని కుళ్ళిపోయిన కూర గాయలతో తయారు చేసి 78 డ్రమ్ముల్లో ఉన్న కల్తీ పచ్చళ్లను సీజ్ చేశారు. మంగళ్ హాట్ లో కుళ్ళిన మటన్, కెమికల్ పెరుగు, కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్, హలీమ్ ను గుర్తించారు. మరొక చోట 3000కేజీల కల్తీ పన్నీరును 610కేజీల కుళ్ళిన చికెన్ స్వాధీనం చేసుకున్నారు. ఇవ్వన్నికూడా వివిధ రెస్టారెంట్స్, బార్ లకు సరఫరా చేయటానికి సిద్ధంగా ఉండటం కొసమేరుపు. ఇటీవల పార్లమెంట్ మాజీ సభ్యులు తెలంగాణ జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత తెలంగాణలో జరుగుతున్న ఆహార కల్తీ గురించి వరుసగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించడంతో ప్రభుత్వం స్పందించి ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీస్ శాఖ సయుక్తంగా హెచ్ ఫాస్ట్ ఏర్పాటు చేసింది. తనిఖీలను ముమ్మరం చేశారు. ఇది ఆరంభ శురత్వం కాకుండా నిత్య పర్యవేక్షణ ఉండేలా చూస్తే అక్రమార్కులు ఇలాంటి కల్తీలకు తెర తీయరు. బిగ్ బాస్కెట్, ఇన్స్టా మార్ట్, లాంటి సంస్థల డార్క్ గోడౌన్లలో కూడా నిత్య తనిఖీలు అవసరం.

(వ్యాస కర్త తెలంగాణ జాగృతి రాష్ట్ర అధికార ప్రతినిధి)

బీసీల డిమాండ్లు నెరవేరేది ఎప్పుడు?

తీగల అశోక్ కుమార్
9666634001

భారతదేశంలో సామాజిక న్యాయం కోసం సాగుతున్న పోరాటంలో వెనుకబడిన వర్గాలు బీసీలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. స్వాతంత్య్రం తర్వాత కూడా సమాన హక్కులు, అవకాశాలు అందరికీ సమానంగా అందడంలేదు. ముఖ్యంగా బీసీలు జనాభాలో పెద్ద శాతంలో ఉన్నప్పటికీ, వారి హక్కులు పూర్తిగా అమలు కాలేదనే వాస్తవం ఉంది. ఈ నేపథ్యంలో బీసీల డిమాండ్లు నెరవేరేది ఎప్పుడు? అనే ప్రశ్న ప్రస్తుత రాజకీయ, సామాజిక పరిస్థితుల్లో మరింత బలంగా ప్రాముఖ్యత పొందింది. భారతీయ సమాజంలో వర్ణవ్యవస్థ అనేక శతాబ్దాలుగా కొనసాగింది. ఈ వ్యవస్థలో కొన్ని వర్గాలు శక్తి, సంపద, విద్యపై ఆధిపత్యం సాధించగా, బీసీలు వంటి వర్గాలు ప్రధానంగా శ్రమ ఆధారిత వృత్తులకు పరిమితమయ్యాయి. విద్య మరియు ఆర్థిక అవకాశాల నుంచి దూరంగా ఉంచబడటం వల్ల వారి అభివృద్ధి దశాబ్దాల పాటు వెనుకబడింది. భారతదేశం సామాజిక వైవిధ్యానికి నిలయంగా నిలిచిన దేశం. ఈ వైవిధ్యంలో వెనుకబడిన వర్గాలు బీసీలు ఒక ముఖ్యమైన భాగం. అనేక అధ్యయనాల ప్రకారం, బీసీలు దేశ జనాభాలో సుమారు 50% కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ, వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితి ఇంకా సమాన స్థాయికి చేరలేదు. ఇది కేవలం ప్రస్తుత పరిస్థితుల వల్ల కాదు, చారిత్రకంగా ఏర్పడిన అసమానతల వల్ల ఏర్పడిన లోతైన సమస్య. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు 50% పైగా భారతదేశంలో వెనుకబడిన వర్గాలు బీసీలు చాలా కాలంగా ఒక ప్రధానమైన డిమాండ్‌ను ముందుకు తెస్తున్నాయి. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి, అంటే వారి జనాభా శాతానికి అనుగుణంగా కనీసం 50% పైగా రిజర్వేషన్లు ఇవ్వాలి అనే అంశం. ఈ డిమాండ్ వెనుక ఉన్న కారణాలు, బీసీలు దేశ జనాభాలో సుమారు 50% పైగా ఉన్నప్పటికీ, ప్రస్తుత రిజర్వేషన్ వ్యవస్థలో వారికి అందుతున్న శాతం దీనికి సరిపోలడం లేదు. ప్రస్తుతం కేంద్ర స్థాయిలో బీసీలకు 27% రిజర్వేషన్ మాత్రమే ఉంది. ఇది వారి వాస్తవ జనాభా శాతంతో పోలిస్తే చాలా తక్కువగా ఉందని వారు భావిస్తున్నారు. ప్రధాన సమస్య 50% పరిమితి భారతదేశంలో రిజర్వేషన్లపై ఒక ముఖ్యమైన చట్టపరమైన పరిమితి ఉంది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుల ప్రకారం ఇందిరా సాహ్నీ కేసు, మొత్తం రిజర్వేషన్లు సాధారణంగా 50% మించకూడదు. ఈ పరిమితి బీసీల డిమాండ్‌కు ప్రధాన అడ్డంకిగా మారింది. అయితే కొన్ని రాష్ట్రాలు ఉదాహరణకు తమిళనాడు ఈ పరిమితిని దాటి 69% వరకు రిజర్వేషన్లు అమలు చేస్తున్నాయి. ఇది ప్రత్యేక చట్టాల ద్వారా సాధ్యమైంది.బీసీ వర్గాల కీలక డిమాండ్ కులగణన (Caste Census) నిర్వహణ. భారతదేశంలో వెనుకబడిన వర్గాలు బీసీలు చాలా కాలంగా చేస్తున్న అత్యంత ముఖ్యమైన డిమాండ్‌లలో ఒకటి కులగణన నిర్వహణ. ఇది కేవలం గణాంకాల సేకరణ కాదు. సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం కీలకమైన అడుగు. కులగణన అంటే దేశంలోని ప్రతి కులానికి చెందిన జనాభా వివరాలను అధికారికంగా నమోదు చేయడం. ఇది సాధారణ జనగణనలో భాగంగా లేదా ప్రత్యేక సర్వే ద్వారా చేయవచ్చు. ఎవరు ఏ కులానికి చెందినవారు, వారి సంఖ్య ఎంత , వారి సామాజిక, ఆర్థిక స్థితి ఏమిటి, ఈ వివరాలు సేకరించడం ద్వారా ప్రభుత్వానికి స్పష్టమైన డేటా లభిస్తుంది. ఎందుకు అవసరం అంటే ప్రస్తుతం బీసీల జనాభాపై ఖచ్చితమైన డేటా లేదు. 1931 తర్వాత పూర్తి స్థాయి కులగణన జరగలేదు. అందువల్ల, రిజర్వేషన్లు అంచనాల ఆధారంగా అమలు అవుతున్నాయి, అసలు అవసరమున్న వర్గాలు గుర్తించడం కష్టం అవుతోంది. భారత చైతన్య యువజన పార్టీ దేశంలో బీసీ వర్గాల హక్కుల సాధన కోసం కట్టుబడి పనిచేస్తున్న ఒక సామాజిక రాజకీయ వేదికగా ఎదుగుతోంది. ముఖ్యంగా పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ గారు బీసీల కీలక డిమాండ్ల కోసం నిరంతరం పోరాటం చేస్తున్నారు. ఇది కేవలం రాజకీయ పోరాటం కాదు. సామాజిక న్యాయం కోసం ఉద్యమం బీసీల సమస్యలను జాతీయ స్థాయిలో ముందుకు తీసుకెళ్తున్నారు. ఉద్యమాలు, దీక్షలు, సమావేశాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచుతున్నారు. బీసీ వర్గాలను ఐక్యంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన నాయకత్వం బీసీ ఉద్యమానికి కొత్త దిశను చూపుతోంది. భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోరాటం, బీసీల హక్కుల సాధనలో ఒక కీలక దశగా నిలుస్తోంది. బోడె రామచంద్ర యాదవ్ గారి నాయకత్వంలో బీసీ వర్గాలు ఐక్యంగా ముందుకు వస్తే, సమాన హక్కులు సాధించడం అసాధ్యం కాదు.

(వ్యాసకర్త బిసివై పార్టీ తెలంగాణ PAC సభ్యుడు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

99121 99844

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

రాజకీయం

అజీజ్ నగర్‌కు గుడిమల్కాపూర్ మార్కెట్?

- అసెంబ్లీలో ప్రతిపాదించిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 26 : నగరంలోని గుడి మల్కాపూర్ కూరగాయల మార్కెట్‌ను చేవెళ్ల నియోజక వర్గం, మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్‌కు తరలించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అసెంబ్లీలో స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కోరారు. గురువారం అసెంబ్లీలో జరిగిన చర్చల్లో ఆయన మాట్లాడుతూ.. గుడిమల్కాపూర్ మార్కెట్ వద్ద స్థలాభావం, విపరీతమైన ట్రాఫిక్ సమస్యల వల్ల రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు. అజీజ్‌నగర్ పరిధిలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలంలో ఈ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే.. నియోజకవర్గంలోని శంకర్ పల్లి, మొయినాబాద్, చేవెళ్ల, షాబాద్, నవాబ్‌పేట్ మండలాల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. ఈ ఐదు మండలాల రైతులు తమ పంట ఉత్పత్తులను నగరానికి తీసుకురావడానికి రవాణా భారంతో పాటు సమయం వృథా అవుతోందని, అజీజ్‌నగర్ సమీపంలో మార్కెట్ ఉంటే రైతులకు మార్కెటింగ్ సౌకర్యం మరింత సులభతరం అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

మద్యం దుకాణాలను మూసివేయాలి

- ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు ఆదేశం

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 26 : శ్రీరామ నవమి పండుగ సందర్భంగా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మద్యం దుకాణాలను మూసివేయాలని పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు 27 మార్చి 2026 (శుక్రవారం) ఉదయం 10:00 గంటల నుండి రాత్రి 10:00 గంటల వరకు కమిషనరేట్ పరిధిలోని అన్ని వైన్ షాపులు, కల్లు దుకాణాలు (టాడీ షాప్స్), బార్లు మరియు రెస్టారెంట్లలోని బార్లు మూసివేయాలని ఆదేశాలు జారీ చేయబడ్డాయి. అయితే స్టార్ హోటళ్లు, రిజిస్టర్డ్ క్లబ్‌లకు ఈ నిబంధన నుండి మినహాయింపు కల్పించబడింది. శాంతిభద్రతల పరిరక్షణ తో పాటు పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

కొలనుగూడ గ్రామంలో హై మాస్ట్ లైటింగ్

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 26: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని కొలనుగూడ గ్రామంలో.. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బందరాజు మాట్లాడుతూ.. గ్రామంలో హై మాస్ట్ లైటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు మాజీ ఎమ్మెల్యే మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ కాంగ్రెస్ పార్టీ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి చొరవతో.. 5 లైటింగ్ లో ఏర్పాటు చేయడం జరిగిందని. బంద రాజు అన్నారు, గ్రామ శాఖ అధ్యక్షులు బండ వెంకటేశ్ గౌడ్ కృష్ణ, వీరదరు ప్రత్యేక చొరవ చూయించి గ్రామానికి లైటింగ్ వచ్చే విధంగా సహకరించినందుకు ప్రత్యేకమైన ధన్యవాదాలు వర్కింగ్ ప్రెసిడెంట్ బందరాజు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు మాజీ ఉపసర్పంచ్ బండ విజయ శ్రీనివాస్, మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ నబీల్, బండ కిష్టయ్య, ఆర్థర్ మహేందర్, ఆధార్ సామయ్య, సయ్యద్ జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డును ప్రారంభించిన కొలన్ హన్మంత్ రెడ్డి

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, మార్చి 26 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని నిజాంపేట్ విలేజ్‌లోని ఇంద్రన్న కాలనీలో సీసీ రోడ్డు దెబ్బతిని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో, కాలనీ వాసులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని ఆశ్రయించారు. సమస్యను వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి జీహెచ్ఎంసి మున్సిపల్ నిధుల ద్వారా సీసీ రోడ్డు నిర్మాణానికి మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, కొలన్ రాజశేఖర్ రెడ్డి, కాలనీ ప్రతినిధులు కుంచెల సైదప్ప, కుంచల రాము, సరళ, లక్ష్మన్న, పి. ప్రభాకర్ రెడ్డి, బాలకృష్ణ, సభావత్ రామచందర్ నాయక్, నాగరాజు, వెంకట్ రెడ్డి, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ విల్లే ప్రీ స్కూల్‌లో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

- సీతారాముల వేషధారణలో అలరించిన చిన్నారులు

ప్రతిపక్షం, కూకట్‌పల్లి , మార్చ్ 26: ఈనాడు కాలనీలోని లిటిల్ విల్లే ప్రీ స్కూల్ లో శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల పట్ల చిన్నారులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో పాఠశాల యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.పాఠశాల విద్యార్థులు శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు మరియు హనుమంతుని వేషధారణలో వచ్చి అందరినీ ముగ్ధులను చేశారు. చిన్నారుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.విద్యార్థులు రామాయణంలోని ఘట్టాలను ప్రదర్శించడంతో పాటు, భక్తి గీతాలకు అనుగుణంగా నృత్యాలు చేసి సందడి చేశారు.వేడుకల అనంతరం పాఠశాల సిబ్బంది విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు శ్రీరామనవమి ప్రత్యేక పానకం, వడపప్పు ప్రసాదాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ.. పండుగలు మన జీవనశైలిలో భాగమని, చిన్నతనం నుంచే పిల్లలకు మన పురాణాల గురించి, రాముని ఆదర్శాల గురించి తెలియజేయడమే ఈ వేడుక ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మున్సిపల్ పరిధిలోని14వ వార్డులో విద్యుత్ స్థంబాల సమస్యలపై విద్యుత్ ఏఈకి కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా 14వ వార్డులో ఇల్లు మధ్యలో ఉన్న ఇనుప స్థంబాల తీసి వాటి స్థానంలో కొత్తగా స్థంబాలను ఏర్పాటు చేయాలని, అలాగే మోడల్ స్కూల్ చుట్టూ కొత్తగా విద్యుత్ స్థంబాల ఏర్పాటు చేసి వైరింగ్ లైటింగ్ వేయాలని కోరారు.

ప్రతిపక్షం, చేవెళ్ల

ప్రజాపాలనలో గ్రామాల అభివృద్ధి

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్ మార్చ్ 26: నర్వ మండలంలోని సీపురం గ్రామంలో దాదాపు 50 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమం మండల, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో, గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ చేతుల మీదుగా, నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో, ఏఎంసీ వైస్ చైర్మన్, డి కృష్ణారెడ్డి , డీసీసీ జనరల్ సెక్రెటరీ నాగన్న గారి శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ , డైరెక్టర్లు, నెట్టెంపాడు వెంకటయ్య, మర్కా నరేష్, గ్రామపంచాయతీ కార్యదర్శి గంగాధర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు P, అశోక్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, వార్డ్ మెంబర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

జూద స్థావరంపై మెరుపు దాడి: ఏడుగురు పట్టివేత

- జూదం జీవితాలను చిన్నాభిన్నం చేస్తుంది
- అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం
- జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, మార్చ్ 26: నస్రుల్లాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నస్రుల్లాబాద్ గ్రామంలో అక్రమంగా జూదం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు, ఎస్సై పి.రాఘవేంద్ర ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో జూదం ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 9,280 నగదుతో పాటు, ఏడు మొబైల్ ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. జూదం అనేది కేవలం ఒక వ్యసనం మాత్రమే కాదు, అది ఒక కుటుంబం యొక్క ఆర్థిక పునాదులను కూల్చే సామాజిక మహమ్మారి. క్షణికానందం కోసం జూదానికి బానిసలైతే, అది అప్పుల ఊబిలోకి నెట్టి, చివరికి ఆత్మహత్యల వంటి దారుణమైన పరిణామాలకు దారితీస్తుందని ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. ప్రజలు, ముఖ్యంగా యువత ఇటువంటి అక్రమ మార్గాలకు దూరంగా ఉండి, బాధ్యతాయుతమైన పౌరులుగా తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు" అని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఐపిఎస్ స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా ఇటువంటి చట్ట వ్యతిరేక పనులు జరుగుతున్నట్లు తెలిస్తే ప్రజలు నిర్భయంగా ముందుకు వచ్చి సమాచారం అందించాలని పోలీస్ శాఖ కోరుతోందని,. అక్రమ కార్యకలాపాల గురించి వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు లేదా డైల్ 100 కు ఫోన్ చేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

మందలించారని ఇంటి నుండి వచ్చిన బాలిక

- ఆదరించిన దామెర పోలీసులు

ప్రతిపక్షం, పరకాల మార్చి 26: తల్లిదండ్రులు మందలించారనే చిన్న కోపంతో ఇంటి నుండి బయటకు వచ్చిన ఓ బాలికను దామెర పోలీసులు క్షేమంగా చేరదీశారు. ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రుల చెంతకు చేర్చడమే కాకుండా, మానవత్వాన్ని చాటుకుంటూ తమతో పాటు భోజనం పెట్టి అందరి ప్రశంసలు అందుకున్నారు.వివరాల్లోకి వెళ్తే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరుకొత్తపల్లి గ్రామానికి చెందిన కేతపాక కృష్ణ కుమార్తె ఐశు (15) శ్రీరాములపల్లి హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. ఇంట్లో తల్లిదండ్రులు ఏదో విషయంలో మందలించడంతో మనస్తాపానికి గురైన బాలిక, గురువారం ఉదయం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి వచ్చేసింది. ఉదయం 11 గంటల సమయంలో దామెర పరిధిలోని ఓగ్లాపూర్ శివారులో ఉన్న సైలాని బాబా దర్గా వద్ద ఒంటరిగా, అనుమానాస్పదంగా తిరుగుతుండగా గమనించిన పెట్రోలింగ్ పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. దామెర ఎస్.ఐ. కొంక అశోక్ బాలికతో సున్నితంగా మాట్లాడి వివరాలు సేకరించారు. వెంటనే ములుగులో ఉన్న ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించి వారిని స్టేషన్‌కు పిలిపించారు. కన్నవారికి, బాలికకు తగిన కౌన్సిలింగ్ ఇచ్చి ఆమెను క్షేమంగా అప్పగించారు. అనంతరం, ఆకలితో ఉన్న బాలికను చూసి చలించిన ఎస్.ఐ. అశోక్, తాను తెచ్చుకున్న భోజనాన్ని ఆమెకు వడ్డించారు. ఎస్.ఐ తో పాటు పోలీస్ సిబ్బంది అంతా కలిసి ఆ బాలికతో సహపంక్తి భోజనం చేసి, భరోసా కల్పించారు. పోలీసుల ఈ చొరవను, బాధ్యతాయుత ప్రవర్తనను స్థానికులు బాలిక తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.

ఎమ్మారై పనుల జాప్యంపై కలెక్టర్ ఆగ్రహం

ప్రతిపక్షం ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి మార్చి 26: జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఎమ్మారై యంత్రం ఏర్పాటుకు అవసరమైన విద్యుత్ సరఫరా పనుల్లో జరుగుతున్న జాప్యంపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆసుపత్రిలోని ఎమ్మారై విభాగం, డయాలసిస్ కేంద్రం పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పర్యవేక్షణలో అధికారుల నిర్లక్ష్యాన్ని గమనించిన కలెక్టర్, విధులకు గైర్హాజరైన ఆసుపత్రి సూపరింటెండెంట్ కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. విద్యుత్ సౌకర్యాల కల్పనకు అవసరమైన పరికరాలను ఇంకా సమకూర్చకపోవడంపై అధికారులను నిలదీస్తూ, ఈ నెలాఖరులోగా పనులన్నీ పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఎమ్మారై యంత్రం ఏర్పాటు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు ఆర్డీఓను ప్రత్యేక అధికారిగా నియమించినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఉప పర్యవేక్షకులు డా. వెంకటరత్నం, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. రాజేష్,టిజిఎమ్మెస్ఐడిసి ఏఈ రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గా కిరణ్ సాగర్

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 26: గజ్వేల్ మునిసిఫ్ కోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికల్లో కిరణ్ సాగర్ భారీ విజయం సాధించారు, గురువారం నాడు జరిగిన ఎన్నికల్లో కిరణ్ సాగర్ 34 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ సాగర్ మాట్లాడుతూ నమ్మకంతో నాకు ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేరస్తు, గజ్వేల్ బార్ అసోసియేషన్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. వైస్ ప్రెసిడెంట్ గా నరేష్, జనరల్ సెక్రెటరీ గా కరుణాకర్, జాయింట్ సెక్రెటరీ గా ఉమారాణి, స్పోర్ట్స్ అండ్ లైబ్రరీ ఎం డి అబ్దుల్ గఫర్, ట్రెజరర్ అశోక్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నాచగిరి బ్రహ్మోత్సవాల హుండీ లెక్కింపు

ప్రతిపక్షం, గజ్వేల్(వర్గల్), మార్చ్ 26: ఈనెల జరిగిన వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో వచ్చిన హుండీ లెక్కింపు కార్యక్రమం గురువారం నాడు నిర్వహించారు. ఈ సందర్భంగా 28,73,064 రూపాయల ఆదాయం సమకూరినట్లుఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పి రవీందర్ గుప్తా, కార్య నిర్వహణ అధికారి బెల్లంకొండ రంగాచారి, పర్యవేక్షణ అధికారి ఉప్పల శశిధర్ గుప్తా, పాలకమండలి సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్, చందా నాగరాజు, గాలి కిష్టయ్య ,కర్రె పద్మ వెంకటేష్, నాయకం శ్రీనివాస్, ఉషా రాజశేఖర్ శర్మ, జక్కయ్య గారి శేఖర్ గుప్తా, జక్కన్న గారి సురేందర్ రెడ్డి, సిబ్బంది సుధాకర్. నరేందర్, నర్సింలు మరియు, భ్రమరాంబిక సేవాసమితి, శివ కేశవ సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

మెదక్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో జనార్దన్ రెడ్డి విజయం

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 26: మెదక్ జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా జనార్దన్ రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. ఆయన ప్రత్యర్థిపై 57 ఓట్ల మెజార్టీ సాధించినట్లు ఎన్నికల అధికారి శిరిగ ప్రభాకర్ వెల్లడించారు.గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. ఉపాధ్యక్షుడిగా శోభన్ గౌడ్, జనరల్ సెక్రటరీగా శ్రీపతి రావు, జాయింట్ సెక్రటరీగా వేణుగోపాల్ చారి, లైబ్రరీ సెక్రటరీగా ధరావత్ రమేష్, ట్రెజరర్‌గా నరసింహులు, స్పోర్ట్స్ సెక్రటరీగా రవి గౌడ్ ఎన్నికయ్యారు.ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మమత, మంజుల, హరిప్రియ, ప్రశాంత్ ఎన్నికైనట్లు తెలిపారు.

దేశంలోని 120 జిల్లాలు, 500 జిల్లా సబ్‌డివిజన్లలో డ్రైవింగ్ స్కూళ్లు ఏర్పాటు చేస్తాం. సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనకబడిన ప్రాంతాల్లో వీటిని ప్రారంభిస్తాం. తద్వారా వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు వస్తాయి. ప్రభుత్వం ఇప్పటికే 200 డ్రైవింగ్ స్కూళ్లు ఓపెన్ చేసింది. దేశంలో 22 లక్షల మంది డ్రైవర్ల కొరత ఉంది.

- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

కబ్జాదారులపై హైడ్రా అధికారులు కొరడా

- పార్కు స్థలాలలో అనుమతిలేని ప్రహరి గోడలు, షెడ్లు కూల్చివేత

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 26 : పాటి ఘనాపూర్ లోని ఆనంద్ నగర్ లో కబ్జాదారులపై హైడ్రా అధికారులు కొరఢా ఝుళిపించారు. పార్కు స్థలాలలో అనుమతిలేని ప్రహరి గోడలు, షెడ్లు కూల్చివేశారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం పాటి ఘనాపూర్ గ్రామంలోని ఆనంద్ నగర్ కాలనీలో హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ నిన్న పర్యటించారు . పాటి సర్వే నంబర్ 185,186,187,239,243,245,246,247 నుంచి 250 లలో ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు విజయ్ , శ్యామ్ తదితరులు ప్రజావాణిలో హైడ్రాకు చేసిన ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ ఏ.వీ రంగనాథ్, అధికారుల బృందం భూమిని పరిశీలించారు. ఆనంద్ నగర్ ప్లాట్లను కొనుగోలు చేసిన బాధితులను కలిసిన హైడ్రా అధికారులు అక్కడి ప్లాట్లు, కబ్జా సమస్యపై ఆరా తీశారు. ప్లాట్ల ఓనర్లకు న్యాయం చేస్తామని హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ భరోసా ఇచ్చారు. దీంతో గురువారం తెల్లవారుజామున ఆనంద్ నగర్ లో అనుమతిలేకుండా నిర్మించిన ప్రహరీ గోడలను, షెడ్లను హైడ్రా అధికారులు నేలమట్టం చేశారు. ఎక్కడ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 26: జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠినంగా చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశంలో జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆదేశించారు. జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. గుజిల్లాలో ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రువారం మెదక్ కలెక్టరేట్లో నిర్వహించిన జిల్లా స్థాయి శాండ్ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీవోలు తాసిల్దార్లు , మైనింగ్ ,ఇరిగేషన్, పంచాయతీ హౌసింగ్ అధికారులతో కలిసి తో కలిసి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఏప్రిల్ 1 నుండి 100% ఇసుక సరఫరా "మన ఇసుక వాహనం" ద్వారా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించాలని స్పష్టం చేశారు. ఇసుక రవాణా పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరగాలని అధికారులను ఆదేశించారు.ఇసుక అక్రమంగా ఇసుక రవాణా చేసే వాహనాలు పట్టుబడితే బైండోవర్ కేసులు నమోదు చేసి జరిమానా విధించాలని ఆదేశించారు. ప్రతి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సకాలంలో ఇసుక అందించేందుకు ఆన్లైన్లో నమోదు చేయించాలన్నారు. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఒక మొబైల్ టీం ఏర్పాటు చేసి అక్రమంగా ఇసుక రవాణాను అడ్డుకోవాలన్నారు. తహసీల్దార్లు వారానికి కనీసం రెండు సార్లు రీచ్లను సందర్శించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రమేష్‌బాబు విజయం

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, మార్చి 26: సిద్దిపేట బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా రమేష్‌బాబు ఎన్నికయ్యారు. సిద్దిపేట కోర్టు ఆవరణలో గురువారం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. బార్ కౌన్సిల్‌లో మొత్తం 205మంది న్యాయవాదులు సభ్యులు ఉండగా, గురువారం జరిగిన ఎన్నికల్లో 203మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో రమేష్‌బాబుకు 106ఓట్లు రాగా, ప్రత్యర్థి అభ్యర్థికి 96ఓట్లు పోలయ్యాయి. 10ఓట్ల మెజార్టీతో రమేష్‌బాబు ఘన విజయం సాధించారు. వైస్ ప్రెసిడెంట్‌గా బి.అరుణ, ప్రదాన కార్యదర్శిగా వి.సదానందం, గేమ్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా ఏ.లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో న్యాయవాదులు వై రాజేశ్వర్‌రెడ్డి, పిన్న రాములు , శివాజీ, జి.రామకృష్ణ, మణి , వెంకన్న, మహేష్, రాజలింగం, తదితరులు పాల్గొన్నారు.

ఇమాంబాద్‌లో 'సురక్షా నేత్ర' కార్యక్రమం

- హాజరైన ఏసీపీ రవిందర్‌రెడ్డి, సీఐ వాసుదేవరావు

ప్రతిపక్షం,సిద్దిపేట టౌన్ ,మార్చి 26: సీసీ కెమరాలు కేసుల చేధనలో ముఖ్య పాత్ర పోషిస్తాయని సిద్దిపేట ఏసీపీ రవిందర్‌రెడ్డి, వన్ టౌన్ సీఐ వాసుదేవరావు తెలిపారు. సిద్దిపేట సురక్షా నేత్ర కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట ఇమాంబాద్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమరాలను సీఐతో కలిసి ఏసీపీ గురువారం ప్రారంభించారు. ఈ సంధర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ సీసీ కెమరాలు ఏర్పాటు వల్ల నేరాలు అరికట్టవచ్చని, ఏదైనా ఘటన జరిగినపుడు నిందితులను గుర్తించడానికి ఉపయోగపడతాయని తెలిపారు. సీసీ కెమరాల ఏర్పాటు వల్ల నేరాలు నియంత్రించవచ్చని తెలిపారు. కెమరాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ నవత, కౌన్సిలర్ సులోచన శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజయ్య, కాలనీ వాసులు సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఒక్క సీసీ కెమెరా పది మంది పోలీసులతో సమానం

- నేరాల అదుపులో సీసీ కెమెరాలది ముఖ్యపాత్ర
- యువత మత్తుకు దూరంగా ఉండాలి
- విద్యార్థులు సెల్ ఫోన్ వాడకం తగ్గించాలి
- చంద్లాపూర్ లో 'సురక్ష నేత్ర' పై అవగాహన
- అడిషనల్ డీసీపీ కుశాల్కర్

ప్రతిపక్షం, చిన్నకోడూర్, మార్చి 26: మనం ఏర్పాటు చేసుకునే ఒక్క సీసీ కెమెరా పది మంది పోలీసులతో సమానమని, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ముఖ్య పాత్ర వహిస్తాయని అడిషనల్ డీసీపీ కుశాల్కర్ అన్నారు. 'సురక్ష నేత్ర' కార్యక్రమంలో భాగంగా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ లో రూ . లక్ష నిధులతో ఏర్పాటు చేసిన 20 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నివారణ, కేసుల ఛేదనలో ఇవి పోలీసులకు మూడో కంటిగా పని చేస్తున్నాయని అన్నారు. ఆధునిక కాలంలో నేరాలను అరికట్టడానికి సాంకేతిక పరిజ్ఞానం అవసరమని, అందులో భాగంగానే సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసు శాఖ విస్తృతంగా అవగాహన కల్పిస్తోందని అన్నారు. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా సీసీ కెమెరాల ఏర్పాటు పెరిగితే పోలీసింగ్ మరింత సమర్థవంతంగా మారుతుందని చెప్పారు. కెమెరాల ద్వారా నేరం జరిగిన వెంటనే నిందితులను గుర్తించడం సులభమవుతుందని వివరించారు. ప్రతి వీధిలో కెమెరాలు ఏర్పాటు చేస్తే నేరస్తులు ముందుగానే వెనకడుగు వేస్తారని పేర్కొన్నారు. సీసీ కెమెరాలు కేవలం కేసుల పరిష్కారానికి మాత్రమే కాకుండా, నేరాలు జరగకుండా నిరోధించడంలో కూడా కీలకంగా పనిచేస్తాయని అన్నారు. అంతకుముందు రూరల్ సీఐ శ్రీను మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు బానిస కావద్దని, జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘించి వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడి కన్న వారికి కడుపుకోత మిగిల్చవద్దని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థులు, యువత చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో చంద్లాపూర్ సర్పంచ్ సురగోని శేఖర్ గౌడ్, ఉప సర్పంచ్ కందుకూరి జయమ్మ, ఎస్సై చంద్ర మోహన్, ఉన్నత పాఠశాల హెచ్ఎం రంజిత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ అభివృద్ధికి 'కౌన్సిల్' పచ్చజెండా

- 96 లక్షల అంచనా వ్యయంతో తీర్మానాలు
- ఏకగ్రీవంగా 43 అంశాలకు ఆమోదం

ప్రతిపక్షం, హుస్నాబాద్, మార్చి 26: హుస్నాబాద్ పట్టణ సమగ్ర అభివృద్ధికి పురపాలక సంఘం పచ్చజెండా ఊపింది. బుధవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ దండి లక్ష్మి అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో పట్టణ ప్రగతికి సంబంధించిన 43 అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా సుమారు 96 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.ముఖ్యంగా పట్టణంలోని 20 వార్డుల్లో వెయ్యి కోతులు పట్టడానికి 6 లక్షల రూపాయలు, వీధి దీపాల నిర్వహణ పనులకు 10 లక్షల రూపాయలు కేటాయించారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా డీఆర్‌సీసీ సెంటర్ వద్ద తడి చెత్తను వేరు చేసేందుకు 50 లక్షల రూపాయలతో కొత్త షెడ్డును నిర్మించాలని నిర్ణయించారు. అలాగే పట్టణంలోని రోడ్లు, డ్రైనేజీలు మరియు కల్వర్టుల మరమ్మతుల కోసం మరో 10 లక్షల రూపాయలను మంజూరు చేశారు. మల్లెచెట్టు చౌరస్తా నుండి ఎల్లమ్మ చెరువు వరకు రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్ తయారు చేసి ఉన్నతాధికారులకు పంపాలని తీర్మానించారు. ముంచుకొస్తున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో నీటి ఎద్దడి తలెత్తకుండా నీటి సరఫరా మోటార్లు, స్టార్టర్ల మరమ్మతుల కోసం 10 లక్షల రూపాయలు కేటాయించారు. వాహనదారుల సౌకర్యార్థం అన్ని కూడళ్లలో సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ పద్మ చిటారి, మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్, కౌన్సిలర్లు అనుష, బురుగు లత, రజిత కొండ, తిరుపతి పిల్లి, రాజు బోలిశెట్టి, భుక్య సంపత్, కాశబోయిన సరిత, గడిపె సతీష్ కుమార్, సావుల మంజుల, పూదరి వరప్రసాద్, కేశవేని రమేష్, బొల్లి శ్రీనివాస్, వైద్యం కిరణ్ ప్రసాద్, రవీందర్ గాడిపాక, వాల సుప్రజ, బత్తుల స్వరూప, గోపగాని శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

28న జాతీయ లోక్ అదాలత్

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రుబినా ఫాతిమ

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 26: జిల్లాలో ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకుని రాజీ పడదగిన కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రుబినా ఫాతిమ సూచించారు.ఈ మేరకు గురువారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ...లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి కక్షిదారులు చొరవ చూపాలని కోరారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే కౌన్సిలింగ్ ద్వారా కేసులను రాజీ మార్గంలో పరిష్కరిస్తామని తెలిపారు. కేసులు రాజీ పడితే ఇరువురికీ లాభమని, కోర్టుల్లో కొనసాగితే సమయం, వ్యయం పెరుగుతాయని పేర్కొన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు లభిస్తాయని తెలిపారు. భార్యాభర్తల వివాదాలు, ప్రమాద కేసులు, వాహన ఫైన్ కేసులు, బ్యాంకు, ఫైనాన్స్, చిట్‌ఫండ్ తదితర కేసులతో పాటు పలు క్రిమినల్, సివిల్ కేసులను లోక్ అదాలత్‌లో రాజీ మార్గంలో పరిష్కరించుకోవచ్చని వెల్లడించారు.

ఆర్టిజన్ కార్మికులను పర్మనెంట్ చేయాలంటూ ధర్నా

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 26: మెదక్ జిల్లా కేంద్రంలో విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు తమను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బివిన్. స్వామి మాట్లాడుతూ..కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులో తమ డిమాండ్లు నెరవేర్చకపోతే రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టే పరిస్థితి వస్తుందని తెలిపారు.ప్రభుత్వం వెంటనే టీవీ జేఏసీ నాయకులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో ఈ నెల 30న పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, ఏప్రిల్ 2న రాష్ట్రవ్యాప్తంగా వర్క్ బంద్/కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు .ఈ కార్యక్రమంలో మెదక్ డివిజన్ చైర్మన్ నాగరాజు, డివిజన్‌కన్వీనర్ పృథ్వీరాజ్ ,నగేష్‌రావు, స్వప్న, అనిత, శరత్, శ్రీశైలం, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట ఐటీ టవర్‌పై కాంగ్రెస్ నిర్లక్ష్యం

- అసెంబ్లీలో హరీష్ రావు ఆగ్రహం

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, మార్చి 26: సిద్దిపేట ఐటీ టవర్ నిర్వహణలో రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అసెంబ్లీలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటీ రంగాన్ని హైదరాబాద్‌కే పరిమితం కాకుండా టియర్ 2 నగరాలకు విస్తరించే లక్ష్యంతో గతంలో సిద్దిపేటతో పాటు వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, ఆదిలాబాద్ ప్రాంతాల్లో ఐటీ టవర్లు ఏర్పాటు చేసినట్లు ఆయన గుర్తుచేశారు. సిద్దిపేట ఐటీ టవర్‌లో గతంలో 18 కంపెనీలు పనిచేసేవని, ప్రస్తుతం 7 కంపెనీలు వెళ్లిపోవడంతో కేవలం 11 కంపెనీలు మాత్రమే కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం సరైన నిర్వహణ చేపట్టకపోవడం, ఇంటర్నెట్ సమస్యలు తలెత్తడం వల్ల కంపెనీలు వెనుదిరుగుతున్నాయని అన్నారు. ఇటీవల ఐటీ టవర్‌ను సందర్శించిన సందర్భంగా పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయని, ఇంటర్నెట్ బిల్లులు చెల్లించకపోవడంతో కనెక్షన్ నిలిపివేసిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. అలాగే నిర్వహణ బాధ్యతలు చూసే అవుట్‌సోర్సింగ్ సంస్థకు బిల్లులు చెల్లించకపోవడంతో అక్కడ పని చేస్తున్న సెక్యూరిటీ, స్వీపర్ తదితర సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు అందలేదని తెలిపారు. గతంలో కంపెనీలను ప్రోత్సహించేందుకు మూడు సంవత్సరాల పాటు ఉచిత అద్దె సదుపాయం కల్పించామని, ప్రస్తుతం అవి స్థిరపడుతున్న దశలో ఉన్నందున మరింత ప్రోత్సాహంగా మరో మూడు సంవత్సరాలు ఫ్రీ రెంటల్ ఫెసిలిటీ కొనసాగించాలని సూచించారు. టియర్ 2 నగరాల్లోని ఐటీ టవర్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలని, కొత్త కంపెనీలను ఆహ్వానించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని హరీష్ రావు కోరారు.

ప్రతి గ్రామంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- లింగాయత్ లింగ బలిజ సమాజం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు మహదేవుని శ్రీనివాస్

ప్రతిపక్షం, కొమురవెల్లి, మార్చి 26: ప్రతి గ్రామంలో శ్రీరామనవమి వేడుకలను ప్రతి ఒక్కరు ఘనంగా నిర్వహించాలని లింగాయత్ లింగ బలిజ సమాజం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ కొమురవెల్లి మండల అధ్యక్షులు మహదేవుని శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం కొమురవెల్లిలో ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా అన్ని గ్రామాల్లో శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ శ్రీరాముల వారి ఆదర్శ భావాలను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. మర్యాదా పురుషోత్తముడు శ్రీరాముడు ధర్మం, సత్యం, న్యాయం, సేవాభావానికి ప్రతీకని, ఆయన చూపిన ధర్మమార్గం మన జీవితాలకు మార్గదర్శకమని, ఈ పవిత్రమైన రోజున మనమంతా సత్యం, నీతి, పరస్పర గౌరవం అనే విలువలను పాటిస్తూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. శ్రీ సీతారాముల దివ్య ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖశాంతులతో ఉండాలని, సిద్దిపేట జిల్లా మరింత అభివృద్ధి సాధించాలని అన్నారు.

'విద్యా కమిషన్ నివేదిక అశాస్త్రీయం'

ప్రతిపక్షం, ప్రతినిధి, మెదక్, మార్చి 26: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలోని సత్యనారాయణ స్వామి కళ్యాణ మండపంలో విద్యా కమిషన్‌పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య మాట్లాడుతూ..ఆకునూరి మురళి సమర్పించిన విద్యా కమిషన్ నివేదిక అశాస్త్రీయమైనదని, అనైతికమని విమర్శించారు. కమిషన్ నివేదిక రూపొందించేటప్పుడు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను సంప్రదించలేదని ప్రశ్నించారు. బడ్జెట్ లో 18% కేటాయింపు ప్రతిపాదించినప్పటికీ అమలు పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ నివేదికను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో తపస్ జిల్లా అధ్యక్షుడు జిడ్డి ఎల్లం, ప్రధాన కార్యదర్శి జాల సిద్ధూ, దుబాషిభాస్కర్, చల్లా లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో హరీష్ రావు గెలిచి చూపించాలి

- సిద్ధిపేట ప్రజలు త్వరలోనే వారసత్వ కుటుంబ పాలనకు బుద్ధి చెపుతారు
- సిద్దిపేటలో ఎప్పటికైనా కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం
- కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట మార్చి 26: వచ్చే ఎన్నికల్లో సిద్ధిపేటలో కాంగ్రెస్ అభ్యర్థిపై ఎమ్మెల్యే హరీష్ రావు గెలిచి చూపించాలి అని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేట లో గురువారం సమావేశం లో సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ.. సిద్దిపేట నియోజకవర్గంలో గత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యే హరీష్‌రావు లక్ష మెజారిటీ ని దెబ్బతీసి చూపించాం అని అన్నారు. సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోటీ చేసి గెలవాలి అని హరీష్ రావు బడాయి మాటలు మాట్లాడుతున్నారు అని సమయం వచ్చినప్పుడు సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోటీ చేస్తారు అని చిత్తుగా మిమ్మల్ని ఓడించే భాధ్యత కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తీసుకుంటారు అని అన్నారు. సిద్దిపేట నియోజకవర్గం ప్రజలు కల్వకుంట్ల కుటుంబమా పాలన చూసి విసిగిపోయారు అని సిద్దిపేట ప్రజలు త్వరలోనే వారసత్వ మీ కుటుంబ పాలనకు బుద్ధి చెపుతారు అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలువదు అని చివరి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని హరీష్ రావు చెప్పడం విడ్డూరంగా ఉంది అని బీఆర్ఎస్ పాలన నచ్చకపోవడంతో ప్రజలు మీకు తగిన బుద్ధి చెపోయిన మీ పార్టీ నాయకులకు ఇంకా మార్పు రాలేదా అని ప్రశ్నించారు. రాజకీయ ఉనికి కోసం బీఆర్ఎస్ నాయకులు పాకులాడుతున్నారు అని మీరు ఎన్ని నాటకాలు జిమ్మిక్కులు చేసిన ప్రజలు మీ పార్టీని నమ్మే పరిస్థితిలో లేరు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలను ఆరు గ్యారంటీలను అమలు చేసి చూపించాము అని అన్నారు. హామీలు ఎక్కడ అమలు చేస్తాము అని బిఆరెస్ నాయకులలో భయం పట్టుకుంది అని అందుకే ఎన్ని విమర్శలు చేసి రాజకీయ లబ్ధి పొందేందుకు చూస్తుంది అని అన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ తో అభివృద్ధి సాధ్యం అవుతుంది అని ప్రజలు నమ్ముతున్నారు అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో సిద్దిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుంది అని సిద్దిపేట నుండి గెలిచిన అభ్యర్థికి మంత్రి పదవి రావడం కూడా ఖాయమే అని అన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కావాలి అని అంటే మరో 10 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలో ఉండేలా ప్రజలు ఆశీర్వదించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్యాదరి మధు, గయాసుద్దీన్ అర్షద్, నజ్జు, విజయ్ డానియల్, బాబా ఫరీద్ తదితరులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరావతి చట్టబద్ధతకు అసెంబ్లీలో తీర్మానం చేయాల్సిన అవసరం ఏంటి? అలాగైతే మండలిలోనూ చర్చ పెట్టాలి. అమరావతిలో సీఎం చంద్రబాబు అవినీతి యజ్ఞం చేస్తున్నారు. అమరావతిపై జగన్‌కు అభ్యంతరం లేదు. అందుకే చంద్రబాబు కంటే ముందే భూమి కొనుక్కొని ఆఫీస్, ఇల్లు కట్టుకున్నారు.

- వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి

మహిళా రిజర్వేషన్ చట్టసవరణకు తొందరెందుకు?

- అసెంబ్లీ ఎన్నికల తర్వాత అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి
- కేంద్ర మంత్రి రిజిజుకు కాంగ్రెస్ చీఫ్ ఖర్గే లేఖ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 26: మహిళా రిజర్వేషన్ కోటా (నారీ శక్తి వందన్ అధినియం) చట్టంలో సవరణలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకంత తొందరపడుతోందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. ఏప్రిల్‌లో అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాక దీనిపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈమేరకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజుకు ఖర్గే గురువారం ఒక లేఖ రాశారు. నారీ శక్తి వందన్ అధినియం చట్టంలో చేయనున్న సవరణలపై చర్చించేందుకు సమావేశం కావాలని కోరుతూ ప్రభుత్వం పంపిన లేఖ తనకు గురువారమే అందిందని ఖర్గే తెలిపారు. దీనిపై కూలంకషమైన చర్చ కోసం ఏప్రిల్ 29 తర్వాత అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించమని సూచిస్తూ మార్చి 24నే విపక్ష పార్టీలు కేంద్రానికి ఒక లేఖను రాశాయని ఆయన గుర్తుచేశారు. "మహిళా రిజర్వేషన్ కోటాకు సంబంధించిన నారీ శక్తి వందన్ అధినియం అనేది ఒక రాజ్యాంగ సవరణ చట్టం. దానిలో మరిన్ని సవరణలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇంతగా ఎందుకు తొందరపడుతోందో నాకైతే అర్థం కావడం లేదు. వాస్తవానికి ఈ చట్టానికి 30 నెలల క్రితమే పార్లమెంటు ఆమోదం లభించింది. నారీ శక్తి వందన్ అధినియం చట్టంలోని నిబంధనలు, అమలు ప్రణాళికపై చర్చించేందుకు వీలైనంత త్వరగా అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని కోరుతూ నేను 2026 మార్చి 16నే లేఖను రాశాను. ప్రభుత్వం నచ్చిన తేదీని సూచిస్తే, సమావేశం అవుదామని ఆనాడు చెప్పాను. ప్రస్తుతానికి విపక్ష పార్టీలన్నీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నాయి. అందుకే ఎన్నికల ప్రచారం ముగిశాక, ఈ అంశంపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని మేం కేంద్ర ప్రభుత్వాన్ని కోరాం" అని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే పేర్కొన్నారు.

విశ్వ వీక్షణం

దౌత్యంలో మోదీ ప్రభుత్వం ఘోర వైఫల్యం

- పశ్చిమాసియా యుద్ధంలో పాక్ మధ్యవర్తిత్వంపై కాంగ్రెస్ ఫైర్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 26: పశ్చిమాసియా యుద్ధంలో మధ్యవర్తిగా పాకిస్థాన్ వ్యవహరిస్తోందనే అంశం ప్రాంతీయ దౌత్యంలో మోదీ ప్రభుత్వ వైఫల్యాన్ని సూచిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. ఈవిషయంలో భారత్ తత్తరపాటును కనిపించకుండా కవర్ చేసే ప్రయత్నాన్ని విదేశాంగ మంత్రి జైశంకర్ చేస్తున్నారని ఆరోపించారు. ఈమేరకు ఆయన ఒక ట్వీట్ చేశారు. సీమాంతర ఉగ్రవాదం, అణ్వస్త్ర విస్తరణ, సామాన్య ప్రజలపై దాడులు చేసిన దుష్ట చరిత్ర కలిగిన పాక్ లాంటి దేశాన్ని మధ్యవర్తిత్వ పాత్రకు పరిశీలించడం అత్యంత దారుణమని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు "పశ్చిమాసియా యుద్ధాన్ని ముగించే చర్చలకు మధ్యవర్తిగా పాకిస్థాన్‌ను పరిగణించడం నిజంగా దారుణం. అది నాలుగు దశాబ్దాలకుపైగా భారతదేశంలో, ఇతర దేశాలలో ఉగ్రవాదాన్ని నడిపించిన దేశం. ఒసామా బిన్ లాడెన్ లాంటి భయంకరమైన ఉగ్రవాదులకు పాక్ ఆశ్రయం ఇచ్చింది. ఇతర దేశాలకు అణ్వస్త్ర టెక్నాలజీని అందించడానికి పాక్‌లోని ఏక్యూ ఖాన్ నెట్‌వర్క్ ప్రయత్నాలు చేసింది. దీని గురించి స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. పాక్ మాజీ అధ్యక్షుడు ముషారఫ్ ఈవిషయాన్ని బహిరంగంగానే అంగీకరించారు. ఈవిధంగా అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక చట్టాలను పాక్ ఘోరంగా ఉల్లంఘించింది. అఫ్గానిస్థాన్‌లోని ఆస్పత్రులు, పౌర సౌకర్యాలపై పాక్ బాంబు దాడులు చేసింది. బెలూచిస్థాన్, ఖైబర్ పఖ్తూన్‌ఖ్వాలో సొంత పౌరులపైనే పాక్ ఎటాక్స్ చేసింది. వివిధ ప్రావిన్సులలో మతపరమైన మైనారిటీలపై దాడులు చేసింది. అలాంటి పాక్‌కు దౌత్యపరమైన వ్యవహారాల్లో స్థానం ఉండకూడదు" అని ట్వీట్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ రాసుకొచ్చారు.

నేను ఇంతేనా నా గీతను నేనే మార్చుకోలేనా?

ప్రతి మనిషి జీవిత ప్రయాణంలో ఏదో ఒక సందర్భంలో ఒక బలమైన ప్రశ్న ఎదురవుతుంది నేను ఇంతేనా? నా స్వభావం ఇలాగే ఉంటుందా? అసలు నన్ను నేను మార్చుకోగలనా? అని. కొందరు పుట్టకతో వచ్చిన బుద్ధి పుడకలతో గానీ పోదు అని నిట్టూర్పు విడుస్తుంటే, మరికొందరు సంకల్పం ఉంటే హిమాలయాలనైనా కదిలించవచ్చు, మనస్తత్వాన్ని మార్చలేమా? అని ధీమాగా చెబుతుంటారు. ఈ రెండు భిన్న ధృవాల మధ్య నిలబడి, ఆధునిక మానవుడు తన అస్తిత్వాన్ని వెతుక్కుంటున్నాడు. మనిషి స్వభావం అనేది ఒక గీచిన గీతలా స్థిరమైనదా లేక ప్రవహించే నదిలా నిరంతరం మార్పుకు లోనయ్యేదా? ఈ ప్రశ్నకు సమాధానం వెతకడం అంటే మనల్ని మనం కొత్తగా ఆవిష్కరించుకోవడమే.

డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ
9490754169

మనస్తత్వశాస్త్ర పరిభాషలో స్వభావం (Personality) అనేది ఒక సంక్లిష్టమైన నేత వంటిది. ఇందులో ఎన్నో దారాలు పెనవేసుకుపోయి ఉంటాయి. ప్రధానంగా నాలుగు కోణాల నుండి మన వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుంది, జన్యు వారసత్వం (Genetics) మన తల్లిదండ్రుల నుండి మనకు లభించే జీవకణాల ముద్రలు. బాల్య అనుభవాలు పసిప్రాయంలో మన మనసుపై పడిన ముద్రలు, ఇంట్లో పెరిగిన వాతావరణం.సంస్కారం మనం నేర్చుకున్న విలువలు, చదువు, సమాజం నేర్పిన పాఠాలు. పరిసరాలు మన చుట్టూ ఉన్న మనుషులు మరియు పరిస్థితులు. ప్రసిద్ధ మనస్తత్వవేత్త కార్ల్ జంగ్ ఒక అద్భుతమైన మాట చెప్పారు. ప్రతి మనిషిలో "ఛాయ" (Shadow) అనే ఒక అంతర్గత పొర ఉంటుంది. ఇది మనకు తెలియకుండానే మన ప్రవర్తనను శాసిస్తూ ఉంటుంది. మన భయాలు, అణిచివేసిన కోరికలు, చీకటి కోణాలు అన్నీ ఇందులో నిక్షిప్తమై ఉంటాయి. చాలామంది వీటిని గుర్తించకుండానే జీవితాంతం గడిపేస్తారు. మనం స్వభావం అని పిలిచేది నిజానికి మన అలవాట్లు, నమ్మకాలు మరియు తక్షణ ప్రతిక్రియల (Reactions) సముదాయం మాత్రమే. ఇవి గట్టిపడిన సిమెంటు గోడల్లా అనిపించవచ్చు కానీ, సరైన పరికరంతో వాటిని కూల్చి కొత్త నిర్మాణం చేపట్టడం అసాధ్యమేమీ కాదు. ఒకప్పుడు శాస్త్రవేత్తలు మెదడు ఎదుగుదల ఒక వయసు వచ్చాక ఆగిపోతుందని భావించేవారు. కానీ ఆధునిక న్యూరోసైన్స్ (Neuroscience) ఈ నమ్మకాన్ని పటాపంచలు చేసింది. మన మెదడు చాలా ప్లాస్టిక్ స్వభావాన్ని కలిగి ఉంటుంది. దీన్నే శాస్త్రీయంగా న్యూరోప్లాస్టిసిటీ (Neuroplasticity) అంటారు. అంటే, మనం కొత్తగా ఆలోచించడం మొదలుపెట్టినప్పుడు లేదా ఒక కొత్త పనిని పదే పదే చేస్తున్నప్పుడు, మెదడులో పాత నాడీ సంబంధాలు (Neural Pathways) బలహీనపడి, సరికొత్త మార్గాలు ఏర్పడతాయి. ఇది ఎలా పనిచేస్తుందంటే, ఒక అడవిలో అందరూ నడిచే ఒక పాత బాట ఉందనుకోండి, అది స్పష్టంగా కనిపిస్తుంది. కానీ మీరు ధైర్యం చేసి ఒక కొత్త దారిలో నడవడం మొదలుపెడితే, కాలక్రమేణా ఆ కొత్త దారి వెడల్పవుతుంది, పాత దారి గడ్డి మొలిచి మూసుకుపోతుంది. మన ప్రవర్తన కూడా అంతే. కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ (CBT) వంటి ఆధునిక పద్ధతులు మనిషి తన ప్రతికూల ఆలోచనా విధానాన్ని

శాస్త్రీయంగా ఎలా మార్చుకోవచ్చో నిరూపిస్తున్నాయి. మైండ్‌ఫుల్‌నెస్ లేదా వర్తమానంలో జీవించడం ద్వారా మన మెదడులోని భావోద్వేగ కేంద్రాలను (Amygdala) అదుపులో ఉంచుకోవచ్చని సైన్స్ స్పష్టం చేస్తోంది. మన తెలుగు సంస్కృతి, భారతీయ వేదాంతం, స్వభావ మార్పు గురించి చాలా లోతైన చర్చ చేశాయి. స్వభావో దుర్నివారః అని పెద్దలు అంటుంటారు అంటే స్వభావాన్ని మార్చడం కష్టమని దీని అర్థం. అయితే, అదే వేదాంతం మార్పుకు మార్గాలను కూడా చూపింది. భగవద్గీతలో అర్జునుడు తన మనస్సు గాలిలా చంచలమైనదని, దీన్ని అదుపు చేయడం సాధ్యమా అని కృష్ణుడిని ప్రశ్నిస్తాడు. అప్పుడు కృష్ణుడు చెప్పిన సమాధానం అత్యంత ప్రాచుర్యం పొందింది, అభ్యాసేన తుకౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే. అంటే నిరంతర అభ్యాసం (Practice) మరియు వైరాగ్యం (Detachment) ద్వారా దేన్నైనా సాధించవచ్చు. మన కవులు వేమన, పోతన, త్యాగయ్య వంటి వారి జీవితాలే ఇందుకు గొప్ప ఉదాహరణలు. ప్రాపంచిక సుఖాల్లో మునిగి తేలిన వేమన, తదనంతరం గొప్ప యోగిగా ఎలా మారారో మనకు తెలుసు. అది కేవలం ఆలోచనా విధానంలో వచ్చిన మార్పు మాత్రమే కాదు, ఆత్మ పరివర్తన. చిత్తశుద్ధి లేని శివపూజ లేలయా అన్న వేమన మాటలు, బాహ్య ప్రవర్తన కంటే అంతరంగ మార్పు ముఖ్యమని నొక్కి చెబుతాయి. ఇక్కడ మనం ఒక విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. స్వభావంలో రెండు రకాలు ఉంటాయి, మొదటిది మూల లక్షణాలు (Core Traits) కొందరు పుట్టకతోనే అంతర్ముఖులుగా (Introverts) ఉంటారు, మరికొందరు బహిర్ముఖులు (Extroverts). ఇవి పూర్తిగా మారవు, కానీ వీటిని మనం మన ప్రయోజనం కోసం మలచుకోవచ్చు. రెండవది ప్రవర్తనా లక్షణాలు (Behavioral Traits), కోపం, అసూయ, అహంకారం, బద్ధకం వంటివి ఇవి. ఇవి మనం పెంచుకున్న అలవాట్లు మాత్రమే. వీటిని ఖచ్చితంగా మార్చుకోవచ్చు. జీవితంలో ఎదురయ్యే పెద్ద పెద్ద సంఘటనలు కూడా మనిషిని సమూలంగా మారుస్తాయి. ఒక ఆత్మీయుని కోల్పోవడం, ఒక గొప్ప విజయం లేదా తీవ్రమైన అనారోగ్యం వంటివి మనిషి ప్రాధాన్యతలను మార్చివేస్తాయి. అప్పటి వరకు కఠినంగా ఉన్న మనసు వెన్నలా కరిగిపోవచ్చు. విజయవాడలో నివసించే రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ రాఘవ రావు (పేరు మార్చబడింది) తన అనుభవాన్ని ఇలా పంచుకున్నారు. నేను ఉద్యోగంలో ఉన్నప్పుడు చాలా స్ట్రిక్ట్. చిన్న విషయానికి కూడా విపరీతంగా అరిచేవాడిని. నా భార్య, పిల్లలు నాతో మాట్లాడాలంటే భయపడేవారు. రిటైర్మెంట్ తర్వాత ఒంటరితనం వెంటాడింది. అప్పుడు నాకు అర్థమైంది, నా కోపం వల్ల నేను అందరినీ దూరం చేసుకున్నానని. మెల్లగా ధ్యానం నేర్చుకున్నాను. ప్రతిరోజూ నా తప్పులను నేనే విశ్లేషించుకోవడం మొదలుపెట్టాను. ఈరోజు నా మనవళ్లతో నేను ఆడుకుంటుంటే, నా పాత స్వభావం తెలిసిన మిత్రులు ఆశ్చర్యపోతుంటారు. మార్పు అనేది వయసుతో సంబంధం లేని ప్రక్రియ. మార్పు కావాలని అందరికీ ఉంటుంది, కానీ అడుగు ముందుకు పడదు. ఎందుకు? స్వయం నిర్మిత పరిమితులు నేను ఇంతే, నేను మారలేను అని మనల్ని మనం ఒక చట్రంలో బంధించుకోవడం. పరిసరాల ప్రభావం పాత స్నేహితులు, అదే వాతావరణం మనల్ని పాత అలవాట్ల వైపు లాగుతుంటాయి. ఓపిక లేకపోవడం మార్పు అనేది ఓవర్ నైట్ రాదు. మొక్క పెరగడానికి సమయం పట్టినట్టే, స్వభావం మారడానికి నెలలు, ఏళ్లు పట్టవచ్చు. భయం నేను మారితే సమాజం నన్ను ఎలా చూస్తుంది? నా పాత స్నేహితులు నన్ను ఎగతాళి చేస్తారా? అనే ఆందోళన. మీరు నిజంగా మారాలనుకుంటే, ఈ క్రింది సూత్రాలు పాటించండి. ముందుగా మీలోని లోపాలను నిజాయితీగా అంగీకరించండి. డైరీ రాయడం దీనికి గొప్ప మార్గం. ఒకేసారి మొత్తం మారిపోవాలని కాకుండా, ఈరోజు నేను ఒక్కసారి కూడా కోప్పడకూడదు అని చిన్న లక్ష్యం పెట్టుకోండి. మంచి ఆలోచనలు పంచుకునే మిత్రులతో గడపండి. పుస్తక పఠనం కూడా ఒక రకమైన సత్సంగమే. ఒక కొత్త అలవాటును 21 రోజులు చేస్తే అది అలవాటుగా మారుతుంది, 90 రోజులు చేస్తే అది మీ స్వభావంలో భాగమవుతుంది. మార్పు ప్రయాణంలో ఒక్కోసారి పాత అలవాట్లు మళ్ళీ దరిచేరవచ్చు. అలాంటప్పుడు నిరాశ చెందకుండా, మిమ్మల్ని మీరు క్షమించుకుని మళ్ళీ ప్రయత్నం మొదలుపెట్టండి. చివరిగా చెప్పాలంటే, మనిషి స్వభావం అనేది ఒక శిల్పం లాంటిది. చెక్కే కొద్దీ కొత్త రూపం వస్తుంది. నేను మారలేను అనేది ఒక సాకు మాత్రమే, మారగలను అనేది ఒక అద్భుతమైన అవకాశం. మార్పు అనేది ఒక గమ్యం కాదు, అది ఒక నిరంతర ప్రయాణం. మన లోపాలను ఒక్కొక్కటిగా తొలగించుకుంటూ, మంచి లక్షణాలను ప్రోది చేసుకుంటూ సాగే ఈ ప్రయాణమే జీవితానికి సార్థకతను ఇస్తుంది. మీరు ఈ క్షణం తీసుకునే ఒక చిన్న నిర్ణయం అది ఎదుటివారిని ప్రేమగా పలకరించడం కావచ్చు లేదా కోపాన్ని అణచుకోవడం కావచ్చు మీ భవిష్యత్ వ్యక్తిత్వానికి పునాది వేస్తుంది. మనిషి తనను తాను పునర్నిర్మించుకోగల ఏకైక జీవి. ఆ శక్తిని గుర్తించిన రోజే నిజమైన మానవ వికాసం మొదలవుతుంది.

> **స్వభావంలో రెండు రకాలు ఉంటాయి, మొదటిది మూల లక్షణాలు (Core Traits) కొందరు పుట్టకతోనే అంతర్ముఖులుగా (Introverts) ఉంటారు, మరికొందరు బహిర్ముఖులు (Extroverts). ఇవి పూర్తిగా మారవు, కానీ వీటిని మనం మన ప్రయోజనం కోసం మలచుకోవచ్చు. రెండవది ప్రవర్తనా లక్షణాలు (Behavioral Traits), కోపం, అసూయ, అహంకారం, బద్ధకం వంటివి ఇవి. ఇవి మనం పెంచుకున్న అలవాట్లు మాత్రమే. వీటిని ఖచ్చితంగా మార్చుకోవచ్చు. జీవితంలో ఎదురయ్యే పెద్ద పెద్ద సంఘటనలు కూడా మనిషిని సమూలంగా మారుస్తాయి. ఒక ఆత్మీయుని కోల్పోవడం, ఒక గొప్ప విజయం లేదా తీవ్రమైన అనారోగ్యం వంటివి మనిషి ప్రాధాన్యతలను మార్చివేస్తాయి. అప్పటివరకు కఠినంగా ఉన్న మనసు వెన్నలా కరిగిపోవచ్చు.**

హర్మూజ్ జల సంధి నుంచి రవాణాకు

ఇండియా సహా ఐదు మిత్ర దేశాలకే అనుమతి

- ప్రకటించిన ఇరాన్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 26: హార్మూజ్ జలసంధి మూసివేయడంతో అనేక దేశాలు ఇబ్బందులు పడుతున్నాయి. దీంతో ఈ జలసంధిని తెరవాలని ఇరాన్‌కు విజ్ఞప్తులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తమ మిత్రదేశాలకు మాత్రమే ఈ జలసంధి నుంచి నౌకల రవాణాకు అనుమతులు మంజూరు చేస్తామని ఇరాన్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా మిత్రదేశాలు, శతృదేశాల జాబితాను విడుదల చేసింది. ప్రధానంగా ఐదు దేశాల్ని మిత్రదేశాలుగా పేర్కొంది. వాటిలో ఇండియా కూడా ఉండటం విశేషం. ఇండియా, చైనా, రష్యా, పాకిస్తాన్, ఇరాక్ దేశాల్ని మిత్ర దేశాలుగా పేర్కొంది. ఈ దేశాలకు చెందిన నౌకల్ని హార్మూజ్ జలసంధి గుండా అనుమతిస్తామని ఇరాన్ తెలిపింది. ఇప్పటికే రెండు నౌకలు బయల్దేరాయని వెల్లడించింది. అలాగే, బంగ్లాదేశ్ నౌకల్ని కూడా అనుమతిస్తామని చెప్పింది. ఈ దేశాలు ఇప్పటికే తమతో మాట్లాడాయని, తమతో సమన్వయం చేసుకుంటాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి అన్నారు. భవిష్యత్తులోనూ ఈ దేశాలకు సహకారం అందిస్తామని, యుద్ధం ముగిసిన తర్వాత కూడా సహాయం కొనసాగుతుందని ఆయన చెప్పారు. మిత్రదేశాలతోపాటు తాము అనుమతించేది లేని శతృదేశాల జాబితాను కూడా ఇరాన్ ప్రకటించింది. ఈ జాబితాలో అమెరికా, ఇజ్రాయెల్, యుద్ధంతో సంబంధం ఉన్న కొన్ని గల్ఫ్ దేశాలు, యుద్ధంలో కీలక పాత్ర పోషించిన దేశాలతో సంబంధాలు కలిగి ఉన్న కూటమి దేశాలున్నాయి. ఈ దేశాలకు చెందిన నౌకల్ని అనుమతించబోమని అరాగ్చి స్పష్టం చేశారు. ప్రస్తుతం తమ దేశం యుద్ధం చేస్తోందని, యుద్ధం సమయంలో శతృదేశాల నౌకల్ని అనుమతించబోమని, అయితే, ఇతరులకు మాత్రం అనుమతి ఉంటుందన్నారు. మిత్రదేశాల నౌకలు ఈ మార్గం గుండా వెళ్లాలన్నా తగిన నిబంధనలు పాటించాల్సిందే. పూర్తి సమన్వయం తర్వాతే నౌకల్ని అనుమతిస్తారు. ఇప్పటికే కొన్ని నౌకలకు అనుమతి లభించింది. ఈ విధానం సంక్షోభం తర్వాత కూడా కొనసాగుతుంది. మిత్రదేశాలకు ఎప్పటికీ హార్మూజ్ జలసంధి అందుబాటులో ఉంటుంది. అయితే, ఈ మార్గంలో ప్రయాణించే నౌకలపై ఇకనుంచి టోల్ వసూలు చేస్తామని ఇరాన్ ప్రకటించింది. ఇప్పటికే కొన్ని నౌకలు టోల్ చెల్లించినట్లు సమాచారం.

మార్కాపురం బస్సు ప్రమాదం
ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రధాని

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 26: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మార్కాపురం జిల్లాలోని రాయవరం వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్రమోదీ స్పందించారు. రోడ్డు ప్రమాదంలో 13 మంది మృతిచెందిన ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. ఇది చాలా విషాదకరమైన ఘటన అని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారికి రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారికి రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. కాగా ఏపీలోని మార్కాపురం జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి పామూరు వెళ్తున్న తెలంగాణకు చెందిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు రాయవరం సమీపంలో పలకల క్వారీల వద్ద కంకర లోడ్‌తో వెళ్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. దాంతో బస్సులో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 13 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 25 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం వారంతా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 41 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఐపీఎల్ రెండో షెడ్యూల్ రిలీజ్

- ఏప్రిల్ 13 నుంచి మే 24 వరకు మ్యాచ్‌లు

ఐపీఎల్ రెండో దశ షెడ్యూల్ రిలీజైంది. ఇప్పటికే తొలి దశ మ్యాచ్‌ల వివరాలు వెల్లడి కాగా, కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మిగతా మ్యాచ్‌ల వేదికలు, తేదీలు విడుదలయ్యాయి. ఏప్రిల్ 13 నుంచి మొదలై మే 24వ తేదీ వరకు మ్యాచ్‌లు జరుగుతాయని బీసీసీఐ గురువారం అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఇందుకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈనెల 28 నుంచి ఏప్రిల్ 12 వరకు తొలి దశ మ్యాచ్‌లు జరగనున్నాయి. చిన్నస్వామి స్టేడియం వేదికగా శనివారం డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) జట్ల మధ్య పోరుతో ఐపీఎల్ 19వ సీజన్‌కు తెరలేవనుంది. 'లీగ్ రెండో దశలో మొత్తం 50 మ్యాచ్‌లు 12 వేదికల్లో జరుగుతాయి. ఇందులో బెంగళూరు, ముంబై, చెన్నై, కోల్‌కతా, ఢిల్లీ, అహ్మదాబాద్, హైదరాబాద్, లక్నో, జైపూర్, ధర్మశాల, రాయ్‌పూర్, న్యూ చండీగఢ్ ఉన్నాయి. ప్లేఆఫ్స్ చేరువయ్యే నాటికి జట్ల మధ్య ఉత్కంఠభరిత మ్యాచ్‌లకు ఆస్కారం ఉంటుంది. సెకండ్ షెడ్యూల్‌లో ఎనిమిది డబుల్ హెడర్ మ్యాచ్‌లు జరుగుతాయి. పంజాబ్ కింగ్స్ తమ మ్యాచ్‌లను న్యూ చండీగఢ్‌తో పాటు ధర్మశాలలో, రాజస్థాన్ రాయల్స్..జైపూర్‌లో, ఆర్‌సీబీ..బెంగళూరుతో పాటు రాయ్‌పూర్‌లో మ్యాచ్‌లు ఆడుతుంది' అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ పేర్కొన్నారు.



కెరీర్‌కు కరోలినా వీడ్కోలు

బ్యాడ్మింటన్ దిగ్గజం కరోలినా మారిన్ ప్రస్థానం ముగిసింది. తన అద్భుత ఆటతీరుతో ఎన్నో చిరస్మరణీయ విజయాలు సాధించిన మారిన్ తన సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించింది. మోకాలి గాయం కారణంగా కోర్టుకు దూరమైన మారిన్ తన సోషల్ మీడియా అకౌంట్ల ద్వారా రిటైర్మెంట్ వీడియో సందేశాన్ని వెలువరించింది. రియో(2016) ఒలింపిక్స్‌లో పసిడి పతకంతో పాటు మూడుసార్లు ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిళ్లు సొంతం చేసుకున్న 32 ఏండ్ల మారిన్ గత కొంత కాలంగా మోకాలి గాయంతో తీవ్రంగా బాధపడుతున్నది. 'ప్రొఫెషనల్ బ్యాడ్మింటన్‌లో నా ప్రయాణం ముగిసింది. గాయంతో శరీరాన్ని ఇబ్బంది పెట్టదల్చుకోలేదు' అని పేర్కొంది.

టీమిండియాలోకి రీ ఎంట్రీపైనే నా దృష్టంతా

భారత సీనియర్ జట్టుకు ఆడాలని కలలు కంటున్న కుర్రాళ్లు ఐపీఎల్‌లో చెలరేగేందుకు సిద్ధమవుతున్నారు. అదిరే ఆటతో సెలెక్టర్ల కంట్లో పడి టీమిండియా జెర్సీ వేసుకోవాలని కొందరు తహతహలాడుతున్నారు. ఒకప్పుడు ఓపెనర్‌గా ఆడిన పృథ్వీ షా సైతం మెరుపు బ్యాటింగ్‌తో పునరాగమనం చేయాలని భావిస్తున్నాడు. ఐపీఎల్‌కు సన్నద్ధమవుతున్న షాను పలకరించగా 'భారత జట్టుకు ఆడకూడదని అనుకుంటారా. నేనే అంతే' అని బదులిచ్చాడు. ఫామ్‌లేమికి తోడు క్రమశిక్షణ కరువవ్వడంతో భారత జట్టుకు ఆపై రంజీలకు దూరమైన పృథ్వీ షా పునరాగమనంపై దృష్టి సారించాడు. ఐపీఎల్‌లో దంచేసి మళ్లీ టీమిండియా జెర్సీ ధరించాలనే పట్టుదలతో ఉన్నాడీ చిచ్చరపిడుగు. ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున బరిలోకి దిగనున్న షా ఈసారి తనదైన ఆట చూపిస్తానని అంటున్నాడు. 'పునరాగమనం గురించి ఆలోచించకుంటే నేను క్రికెట్ ఆడడంలో అర్థమే లేదు. నేను మళ్లీ భారత జట్టుకు ఎంపికవ్వాలనే కసితోనే ఆడుతున్నా. ఎవరైనా ఇండియాకు ఆడకూడదని అనుకుంటారా? నేను అంతే. అందుకోసం తీవ్రంగా శ్రమిస్తున్నా. నిరుడు నేను నా జీవితాన్ని ఆస్వాదించాను. మెదడును ప్రశాంతంగా ఉంచుకునేందుకు రెండు మూడు పర్యటనలకు వెళ్లా. ఆ తర్వాత మళ్లీ బ్యాట్ అందుకున్నా. ప్రాక్టీస్ మొదలెట్టాను. మునపటికంటే మూడింతలు ఎక్కువగా కష్టపడుతున్నా. గత రెండు సీజన్లు నేను గొప్పగా ఆడలేదు. ఓపెనర్‌గా నా నుంచి చాలా ఆశించారు. కానీ, నేను విఫలమయ్యాను. ఈసారి మాత్రం దూకుడుగా ఆడతాను' అని పృథ్వీ షా వెల్లడించాడు.

రింకూ సింగ్‌కు యూపీ ప్రభుత్వం ఉద్యోగం

- స్పోర్ట్స్ ఆఫీసర్‌గా జాబ్ ఆఫర్

టీమిండియా క్రికెటర్ రింకూ సింగ్ రీజినల్ స్పోర్ట్స్ ఆఫీసర్‌గా నియమితుడయ్యారు. స్పోర్ట్స్ కోటాలో ఆయనకు యూపీ సర్కార్ ఆ జాబ్ ఆఫర్ చేసింది. ఈ నేపథ్యంలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు క్రికెటర్ రింకూ ధన్యవాదాలు తెలిపారు. సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని రింకూ షేర్ చేశారు. యూపీ సర్కారు తనకు 3 కోట్ల ఆర్థిక సాయం చేసిందన్నారు. రీజినల్ స్పోర్ట్స్ ఆఫీసర్‌గా నియమించినందుకు థ్యాంక్స్ చెబుతున్నట్లు ఆ వీడియోలో పేర్కొన్నారు. మంగళవారం జరిగిన అపాయింట్‌మెంట్ లెటర్ పంపిణీ కార్యక్రమానికి రింకూ హాజరుకాలేకపోయారు. ఐపీఎల్ సీజన్ నేపథ్యంలో ప్రస్తుతం కేకేఆర్ జట్టుతో ప్రాక్టీస్ సెషన్‌లో ఉన్నాడు. త్వరలోనే లక్నోకు వచ్చి సీఎంను కలుస్తానని, ఆయన ఆశీర్వాదం తీసుకోనున్నట్లు చెప్పారు. ఐపీఎల్ ఫ్రాంచైజీతో ఉన్న ఒప్పందం ప్రకారం సెర్మనీకి రింకూ రాలేకపోయినట్లు డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ ఆర్పీ సింగ్ తెలిపారు. లక్నోలో ఉన్న స్పోర్ట్స్ డైరెక్టరేట్ ఆఫీసులో రింకూ విధులు నిర్వహిస్తారన్నారు. అయితే టీమిండియాతో ఆడే షెడ్యూల్‌ను పరిగణలోకి తీసుకుని రింకూకు అడ్మినిస్ట్రేట్ విధులను అప్పగించనున్నట్లు చెప్పారు.



శ్రీరామనవమి కానుకగా వాల్మీకి రామాయణం ఫస్ట్ లుక్

భారతీయ ఇతిహాసం రామాయణాన్ని వెండితెరపై మరోసారి ఆవిష్కరించేందుకు సిద్ధమవుతుంది జాతీయ అవార్డు గ్రహీత, దర్శకురాలు భావనా తల్వార్. ఆమె దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం 'వాల్మీకి రామాయణం'. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ గురువారం విడుదల చేశారు. భక్తి మరియు భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా ఉన్న ఈ పోస్టర్ ప్రస్తుతం సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో శ్రీరాముడి పాదాలను చూపించడం విశేషం. "పర్వతాలు ఉన్నంత కాలం, నదులు ప్రవహించినంత కాలం రామాయణం జీవించే ఉంటుంది" అనే శక్తివంతమైన క్యాప్షన్‌తో ఈ పోస్టర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. చాలా ఏండ్ల తర్వాత భావనా తల్వార్ మెగాఫోన్ పట్టి ఈ సినిమా తెరకెక్కిస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైన్ చేస్తుండగా.. బినోద్ ప్రధాన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. రసూల్ పూకుట్టి సౌండ్ డిజైన్ అందిస్తున్నాడు. ఆనంద్ నీలకంఠన్ మరియు చంద్రప్రకాష్ ద్వివేది కథను అందిస్తున్నారు. మరోవైపు ఈ భారీ పౌరాణిక చిత్రం గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

బాలకృష్ణకు జీవిత సాఫల్య పురస్కారం

అంతర్జాతీయ ఢిల్లీ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్‌డి) 2026లో భాగంగా తెలుగు సినీ దిగ్గజం, లెజెండరీ నటుడు నందమూరి బాలకృష్ణకు జీవిత సాఫల్య పురస్కారం లభించింది. ఐదు దశాబ్దాల అసాధారణ సినీ వారసత్వాన్ని, చిత్ర పరిశ్రమకు చేసిన సేవలకు గుర్తుగా ప్రతిష్ఠాత్మకమైన భరత్ మండపంలో జరిగిన అంతర్జాతీయ ఢిల్లీ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్‌డి) 2026లో తెలుగు సినిమా దిగ్గజం నందమూరి బాలకృష్ణకు జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. 50 ఏళ్ల ప్రస్థానంలో భారతీయ సినిమాకు ఆయన చేసిన అపారమైన సేవకు గుర్తింపుగా, నటన కళ పట్ల ఆయనకున్న చెరగని ప్రభావం, బహుముఖ ప్రజ్ఞ, అసమానమైన అంకితభావానికి నివాళిగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. మార్చి 25న న్యూఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమానికి నందమూరి బాలకృష్ణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చిత్ర, సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రముఖుల సమక్షంలో ఢిల్లీ గౌరవ ముఖ్యమంత్రి రేఖా గుప్తా చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు.



'పెద్ది' షూటింగ్‌లో రామ్ చరణ్‌కు గాయం

- చిరంజీవి పోస్ట్‌తో ఊపిరి పీల్చుకున్న అభిమానులు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ షూటింగ్‌లో గాయపడ్డాడన్న వార్త అభిమానులను ఎంతగా కలవరపరిచిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 'పెద్ది' సినిమా చిత్రీకరణ సమయంలో ఆయన కంటికి గాయం కావడం చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్‌లో జరుగుతున్న షూటింగ్ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవి స్వయంగా స్పందిస్తూ సోషల్ మీడియా ద్వారా హెల్త్ అప్‌డేట్ ఇచ్చారు. "ఈ క్లిష్టసమయంలో చరణ్ కనురెప్పకు అత్యంత నైపుణ్యంతో చికిత్స అందించిన వైద్య బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు. మొదట కొంత ఆందోళన ఉన్నప్పటికీ, వైద్యుల భరోసా మాకు ధైర్యం ఇచ్చింది. ప్రస్తుతం అంతా సవ్యంగానే ఉంది" అని ఆయన పేర్కొన్నారు. చిరంజీవి చేసిన ఈ ప్రకటనతో మెగా అభిమానులు ఊపిరిపీల్చుకున్నారు. సోషల్ మీడియాలో చరణ్ త్వరగా కోలుకోవాలని కోరుతూ ఫ్యాన్స్ పెద్ద ఎత్తున పోస్టులు చేస్తున్నారు. ఇక 'పెద్ది' సినిమా విషయానికి వస్తే, ఈ చిత్రాన్ని దర్శకుడు బుచ్చిబాబు తెరకెక్కిస్తున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాలో ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. అలాగే శివరాజ్ కుమార్, జగపతి బాబు వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గాయం కారణంగా రామ్ చరణ్ కొద్దిరోజులు విశ్రాంతి తీసుకోనున్నప్పటికీ, షూటింగ్ షెడ్యూల్‌లో పెద్ద మార్పులు లేకుండా ముందుకు తీసుకెళ్లాలని చిత్ర యూనిట్ భావిస్తోంది. ఏప్రిల్ 30న సినిమా విడుదల చేయాలనే లక్ష్యంతో మేకర్స్ వేగంగా పనులు కొనసాగిస్తున్నారు.

థాయ్‌లాండ్‌లో బడ్డీమూన్

టాలీవుడ్ క్యూట్ కపుల్ రష్మిక, విజయ్ దేవరకొండ వివాహం అనంతరం ఇప్పుడు తమ జీవితాన్ని హాయిగా ఎంజాయ్ చేస్తున్నారు. గత నెలలో ఉదయ్‌పూర్‌లో అత్యంత సన్నిహితుల మధ్య వివాహ బంధంతో ఒక్కటైన ఈ జంట, ప్రస్తుతం థాయ్‌లాండ్‌లో స్నేహితులతో కలిసి 'బడ్డీమూన్' ట్రిప్‌లో భాగంగా విహరిస్తోంది. ఈ ట్రిప్‌కు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాజాగా రష్మిక తన సోషల్ మీడియాలో షేర్ చేసిన వీడియోలో, విజయ్‌ను "నా భర్త" అని పిలవడం తనకు ఇంకా కొత్తగానే అనిపిస్తోందని ముచ్చటగా చెప్పింది. ఈ వీడియోలో ఇద్దరూ కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేయడం, సరదాగా డ్యాన్స్ చేయడం, భవిష్యత్తు గురించి మాట్లాడుకోవడం వంటి క్షణాలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200